ఓం నమో భగవతే శ్రీ రమణాయ



# రమణ భాస్కర



వ్యవస్థాపక సంపాదకులు : బి. వి. ఎల్. ఎన్. రాజు

సంపుటి : 32 సంచిక : 2 అక్టోబరు 2026

## ఈ సంచికలో. . . .

ఉన్నది ఒక్కటే - అది సర్వాంతర్యామి ................. 2

సద్గురు శ్రీనాన్నగారి అనుగ్రహభాషణములు........... 5

**ఇతర విషయములు :**

చావలి సూర్యనారాయణమూర్తి గారి వ్యాసం



మనం సాధన చేసి
నామరూపముల నుండి
విడుదల పొందితే నది వెళ్ళి
సముద్రంలో కలిసిపోయినట్లే
మనం కూడా ఇప్పుడే
హృదయసాగరంలో
ఐక్యమవుతాము.

రమణ భాస్కర
ఆధ్యాత్మిక మాస పత్రిక
పేజీలు : 28
గౌరవ సంపాదకులు
శ్రీమతి P. H. V. సత్యవతి (హైమ)

చందా
సంవత్సర చందా:రు॥ 150/-
విడి ప్రతి : రు॥ 15/-

చిరునామా
రమణ భాస్కర
శ్రీ రమణ క్షేత్రం,
జిన్నూరు - 534 265
ప॥గో॥ జిల్లా, ఆం॥ప్ర॥

పబ్లిషర్
సద్గురు శ్రీ నాన్నగారు
శ్రీ రమణ క్షేత్రం
జిన్నూరు - 534 265
9441122622
7780639977

ప్రింటర్
శ్రీ భవాని ఆఫ్‌సెట్ ప్రింటర్స్
(దుడే శ్రీను) ఎస్. వి. ఆర్. కాంప్లెక్స్,
పాలకొల్లు, 9848716747

డిజైనింగ్
అనన్య జిరాక్స్ & నెట్ సెంటర్
(నందిగామ శేషసాయి)
పి. పి. రోడ్డు, లజపతిరాయ్ పేట,
పాలకొల్లు, 9397151342

ఓం శ్రీనాన్నపరమాత్మనే నమః

# ఉన్నది ఒక్కటే – అది సర్వాంతర్యామి

**(సద్గురు శ్రీనాన్నగారి అనుగ్రహ భాషణముల నుండి సేకరణ)**

భగవంతుడు సర్వాంతర్యామి. అంతర్యామిగా లోపల హృదయంలో ఉన్నాడు, బయట కూడా ఉన్నాడు. భగవంతుడు నీ లోపల ఉన్నాను అని చెపితే బయట లేడు అనుకోకండి. భగవంతుడు అంతటా వ్యాపించి ఉన్నాడు. ఉన్నది ఒక్కటంటే ఒక్కటే. అదే ఆత్మ, అదే సత్యం, అదే బ్రహ్మం. ఆ బ్రహ్మంనే భక్తులు ఈశ్వరుడు అని, భగవంతుడు అని పిలుస్తారు. బ్రహ్మం ఎప్పుడూ రెండుగా లేదు, మూడుగా లేదు. ఉన్నదంతా ఒక్కటే. ఉన్నదాంట్లోనే ఊరికే ఇదంతా కనిపిస్తోంది అంతే. ఈ జగత్తు, జీవుడు, ఈశ్వరుడు బ్రహ్మం యందు కల్పించబడ్డాయి. ఆ బ్రహ్మమే మనకి జీవుడిగా కనిపిస్తున్నాడు. బ్రహ్మమే మనకి గురువుగా కనిపిస్తోంది. బ్రహ్మమే మనకి ఈశ్వరుడిగా కనిపిస్తోంది.

ఏదైతే యదార్థమో ఏదైతే అన్ని అవస్థలలో ఉంటుందో, ఏదైతే అన్ని కాలాలలో, అన్ని యుగాలలో ఉంటుందో, అదే సత్యం, అదే బ్రహ్మం. ఆ పారమార్థిక సత్యంలో, నువ్వు ఏదిగా ఉన్నావో ఆ బ్రహ్మంలో, ఈ యుగాల గొడవలు ఒట్టి బుడగలు. సముద్రంలో కెరటం లేస్తుంది, మళ్ళీ అణిగిపోతుంది, అలాగే ఆ బ్రహ్మంలో, ఆ చైతన్యములో, ఆ మహా శాంతిసాగరములో, ఆనందసాగరములో, కొన్ని వేల సంవత్సరాలు ఉండే ఈ యుగాలు అన్నీ కూడా ఊరికే కెరటం కింద వచ్చి మళ్ళీ అక్కడే పడిపోతాయి. ఈ యుగాలు అన్నీ బ్రహ్మం యొక్క కోణంలోనుంచి చూస్తే, ఇవన్నీ కెరటాలు, బుడగలు, నురుగు అన్నారు. అది ఆ చైతన్య స్థితి. సర్వాంతర్యామి అయిన ఈశ్వరుడే ఆత్మరూపంలో మన హృదయంలో కూడా ఉన్నాడు. ఆత్మరూపంలో ఉన్న ఈశ్వరుడు, మహావెలుగు, మహాకాంతి, మహాశాంతి, మహాజ్ఞాని. భగవంతుడిని అనేక జన్మలు ఆరాధించగా ఆరాధించగా, మన ప్రేమకి కరిగి, భక్తికి కరిగి మనకి స్వాధీనం అవుతాడు. మన చదువు వల్ల కాని, ధనం వల్ల కాని, మనకున్న తెలివితేటలకి కాని భగవంతుడు స్వాధీనం అవ్వడు. మనకున్న ప్రేమ వల్లే, భక్తి వల్లే భగవంతుడు కట్టుబడతాడు. ఒక భక్తికే ఆ శక్తి ఉంది. భక్తికి మాత్రమే వాడు తెలియబడతాడు. భక్తి పరిపక్వతని బట్టి సాక్షాత్కరిస్తాడు.

అయితే, మనకి దేహాభిమానం ఎక్కువ. ఆ చైతన్యవస్తువు, ఆ స్వర్గరాజ్యం మన హృదయంలో ఉన్నప్పటికీ ఆ దేహాభిమానం, దేహం పట్ల ఆసక్తి మనస్సుని లోపలికి వెళ్ళనివ్వదు. హృదయంలో ఉన్న నారాయణుడిని చూడటానికి ఇప్పటివరకూ మనము

ప్రయత్నం చేయటం లేదు, ఇది చేతకాక తీర్థ యాత్రలు అని గుడులని అలా బయట తిరుగుతున్నాము. ఆత్మజ్ఞానం కలిగేవరకూ, హృదయంలో ఉన్న నారాయణుడు దర్శనం అయ్యేవరకూ మనకి తృప్తి లేదు. మనం యాత్రలకు వెళ్ళవచ్చు, దానివలన చివరికి కొంత పుణ్యము చెమట మిగులుతుంది. భగవాన్‌తో ఎవరైనా యాత్రలకి వెళ్లివస్తాము అని చెపితే, మంచిదే వెళ్లిరండి అక్కడ ఏమీ లేదు అని తెలుసుకోవటానికి వెళ్లి రండి అనేవారు.

కొంతమంది మాకు రాముడు కనిపించాడు, కృష్ణుడు కనిపించాడు అంటూ ఉంటారు. అది నిజమే, కనిపించవచ్చు. కాని ఆ రాముడిని చూసిన మీ మనస్సు ఎంత నిజమో, మనస్సు చేత చూడబడిన దేవుడు కూడా అంతే నిజం. మీకు ఆ దేవుడు వరం ఇవ్వవచ్చు. వరం కోరిన మీ మనస్సు ఎంత నిజమో, వరం ఇచ్చిన దేవుడు కూడా అంతే నిజం. లోపల హృదయంలో ఉన్నఈశ్వరుడిని దర్శించటానికి ప్రయత్నం చేయండి, ఈ కొంపలలో ఎన్నాళ్ళు తిరుగుతారు. జేబులో డబ్బులు ఉన్నాయి అని ఇంక తిరగటమే పనా. దేవాలయాలకి వెళ్తున్నారు దేవుడిని దర్శిస్తున్నారు మంచిదే, కాని అవన్నీ రెండో పక్షం. మీ హృదయంలో ఈశ్వరుడు ఉన్నాడు, వాడిని దర్శించటానికి చిన్న ప్రయత్నం అయినా చేయరా! మీ హృదయంలో ఉన్న ఈశ్వరుడిని దర్శిస్తేనే మీకు తృప్తి కలుగుతుంది. బయట తిరిగి చూసి రావచ్చు కాని అక్కడ మీకు తృప్తి ఉండదు. తృప్తి అనేది లోకంలో ఏ విషయంలోనూ లేదు. సత్యపదార్థంలో తప్పించి తృప్తి అనేది బయట లేనేలేదు. బాహ్యంగా అన్ని కోరికలు నెరవేరిపోతున్నాయి అనుకోండి, మీకు తృప్తి రాదు, వచ్చిన కోరికనల్లా నెరవేర్చుకొంటూ కోరికలు జయించిన వాడు సృష్టిలో ఎవడూ లేదు. కోరికలు పెట్టుకొని దేవుడిని ధ్యానం చేస్తే కోరికలు నెరవేరతాయి. నెరవేరిన తరువాత అది చెడ్డ తీసుకొస్తుందో మంచి తీసుకొస్తుందో మనకి తెలియదు. మనకి ఏది మంచిదో మనకంటే ఈశ్వరుడికి ఎక్కువ తెలుసు అని మనకి తెలియటం లేదు.

ప్రతి మానవుడికి ఏదో వెలితి ఉంటుంది. మన హృదయంలో ఉన్న నిజం దగ్గరికి వెళ్ళేవరకూ ప్రతి మనిషిని ఏదో వెలితి వెంటాడుతూ ఉంటుంది. పరిస్థితులు అన్నీ బాగానే వున్నాయి కానీ ఏమిటో అశాంతిగా ఉంటోంది, అశాంతికి కారణం ఏమిటో చెప్పలేక పోతున్నాము అని కొంతమంది అంటారు. ఉన్నది ఒకటే, అది లోకం కింద, జీవుడి కింద నీకు కనిపిస్తోంది. అందుకే నీకు భయం వేస్తోంది. హృదయంలో ఏ వస్తువు అయితే ఉందో – మీకు నాకు జగత్తుకి సృష్టికి పంచభూతాలకి ఏ వస్తువు అయితే ఆధారంగా ఉందో, ఏది ఈ ప్రపంచానికి సపోర్ట్‌గా ఉందో – దాని తాలూకు అనుభవం పొందేవరకూ ఏదో ఒక వెలితి, అశాంతి, భయం వెంటాడుతూనే ఉంటుంది.

డబ్బు ఉంటే సుఖపడిపోతాము, చదువు ఉంటే సుఖపడిపోతాము, లేకపోతే ఏదైనా పదవి వస్తే సుఖపడిపోతాము అని మనం అనుకుంటాము. కాని భగవంతుడు ఏమి చెపుతున్నాడు అంటే, నీ హృదయంలో ఒక చావు లేని సత్పదార్థం ఉంది, దాని స్వరూపమే సుఖము దాని స్వరూపమే శాంతి. నీ హృదయములోనే సుఖం ఉంది, శాంతి ఉంది, అక్కడికి వెళ్ళేవరకు శాంతి లేదు, సుఖం లేదు అని చెపుతున్నాడు. ధనము, చదువు, ఈ అపరావిద్యలు అన్నీ కూడా దేహయాత్రకి పనికి వచ్చేవి. ఆత్మవిద్య వల్ల మాత్రమే ఆత్మ తెలియబడుతుంది. ఏ వస్తువుని తెలుసుకున్నాక నువ్వు దుఃఖరహితుడవు అవుతావో ఆ స్థితిని పొందు అర్జునా అన్నాడు భగవంతుడు భగవద్గీతలో. ఏ సుఖాన్ని పొందిన తరువాత, ఏ శాంతిని, ఆనందాన్ని పొందిన తరువాత దానికి మించిన ఆనందం లేదని మీకు తెలుస్తుందో, అట్టి ఆనందాన్ని పొందు. రాగద్వేషాలు తగ్గించుకో. ఆహారం విషయంలో జాగ్రత్తగా ఉండు. రోగానికి ఏవిధంగా అయితే మందు వాడతావో, ఆకలి అనే రోగానికి అంతవరకే తిను. నీ దేహాన్ని మనస్సుని ఆత్మజ్ఞానం సముపార్జించటానికి కండిషన్ లో పెట్టుకో. నువ్వు పొందవలసినది ఏదో ఈ దేహం ఉండగానే, ఈ శవం భూమిమీద తిరుగాడుతున్నప్పుడే పొందు. శాస్త్రాన్ని ప్రమాణంగా పెట్టుకొని, భగవంతుడు చెప్పిన వాక్యాన్ని ప్రమాణంగా పెట్టుకొని జీవించు అని చెపుతున్నాడు.

ఈశ్వరుడు మన హృదయంలోనే ఉన్నాడు కదా, మన మనస్సుని పక్వం చేసి, ఇంద్రియాలని మనస్సుని లోపలికి మళ్ళించేవాడు ఆయనే. మన మనస్సుకి మెచ్యూరిటీ తీసుకొచ్చి, మన మనస్సు ఎంత స్పష్టంగా మనకి తెలుస్తోందో అంత స్పష్టంగా ఆయన మనకి ఎరుకలోకి వస్తాడు. ఎక్కడో ఉన్నాడు అనుకున్నాము, ఇక్కడే ఉన్నాడు ఏమిటి, ఎప్పుడో తెలుస్తుంది అనుకున్నది ఇప్పుడే తెలిసింది అని అప్పుడు మనం అనుకొంటాము.

అన్ని మతాలు చెప్పేది ఆ బ్రహ్మానందాన్ని పొందమని. ఎన్నో రకాల ఆనందాలు ఉన్నాయి, అన్నిటికంటే ఉన్నతమైనది, స్వతంత్రమైనది బ్రహ్మానందం. ఉన్నది ఒక్కటంటే ఒక్కటే, దాని స్వరూపమే ఆనందం, దాని స్వరూపమే శాంతి, దాని స్వరూపమే ఉండటం. దానిని పొందిన వాడికి ఇంద్రియాల ద్వారా, శరీరం ద్వారా, మనస్సు ద్వారా పొందే అన్ని సుఖాలు ఒకేచోట ఇమిడిపోతాయి. వాడికి ఉన్న వేలాది కోరికలు ఒక్క క్షణంలో తీరిపోతే ఎంత ఆనందంగా ఉంటుందో బ్రహ్మానందం అలా ఉంటుంది. అందుకే బ్రాహ్మీ స్థితి పొందినవాడిని పూర్ణకాముడు అంటారు. అన్ని కోరికలు నెరవేరిన వాడే కోరిక లేకుండా పని చేయగలడు. ఒక పూర్ణకాముడు మట్టుకే నిష్కాముడిగా ఉండగలడు.

**మూలం: శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు- 14 నవంబర్ 2004, పాలకొల్లు & 27 నవంబరు 2008, గొరగనమూడి**

ఓం శ్రీనాన్న పరమాత్మనే నమః

## సద్గురు శ్రీనాన్నగారి అనుగ్రహభాషణములు - 5 జూలై 1996, జిన్నూరు

ప్రియమైన ఆత్మబంధువుల్లారా!

ఆచార్యులవారు ఏమి చెబుతున్నారు అంటే ఉన్న వస్తువు ఒక్కటే, దానినే బ్రహ్మం అంటున్నారు, ఆత్మ అంటున్నారు. పదార్థం ఒక్కటే, బంగారం ఒక్కటే అది అనేక వస్తువులుగా చేయించుకోవచ్చు, మట్టి ఒక్కటే అనేక కుండలుగా మార్చుకోవచ్చు, మీరు కుండ చూసినా మట్టే కనపడాలి, వస్తువుని చూసినా బంగారమే కనపడాలి. కుండలో మట్టి లేని ప్రాంతం ఉండదు, వస్తువులో బంగారం లేని ప్రాంతం కూడా ఉండదు. ఉన్నది బ్రహ్మమే, ఉన్నది ఒక్కటే. అదే అంతటా వ్యాపించి ఉంది. అది ఏకంగా ఉంటుంది, అది నిత్యంగా ఉంటుంది, అద్వితీయంగా ఉంటుంది. అది స్వయం ప్రకాశమైనది. దాని ప్రకాశానికి ఇతర వస్తువుల మీద ఆధారపడి ఉండక్కర్లేదు. ఆ బ్రహ్మం తప్పించి మిగతాది అంతా జడమే. మీ బుద్ధి, ఇంద్రియాలు, ఈ ప్రపంచం అంతా జడమే.

అక్షరమణమాలలో భగవాన్ ఏమన్నారు అంటే ఉన్నది ఒక్కటి మాత్రమే. మరి నువ్వు వచ్చావు, నేను వచ్చాను, ఈ లోకం వచ్చింది, దేవతలు వచ్చారు, వీళ్ళు అందరూ ఎక్కడ నుంచి వచ్చారు? ఉన్నది ఒక్కటే!

**ఒకడవౌ నిను మాయ మొనరించి, వచ్చువారెవరిది నీ జాల మరుణాచలా**

ఉన్నది ఒక్కటే, ఉన్నది ఒక్కటే అయితే నాకు ఒకటిలాగే కనిపించాలి కదా, ఇదంతా ఎక్కడ నుంచి వచ్చింది? ఇదంతా నీ జాలము, ఇదంతా నీ మాయ అన్నారు అక్షరమణమాలలో రమణస్వామి. దానికి ఆచార్యులవారు ఏమంటున్నారు అంటే, ఎండమావులు ఉంటాయి, ఎండమావుల్లో నీళ్ళు ఉండవు. ఎండమావుల్లో నీళ్ళు లేకపోయినా అక్కడ నీళ్ళు ఉన్నట్టు నీ మనసుకి కనిపిస్తున్నాయి. అలాగే ముత్యపు చిప్ప ఉంది, ముత్యపు చిప్పలో వెండి లేకపోయినా ముత్యపు చిప్ప వెండిగా నీ మనసుకి కనిపిస్తుంది. అదేవిధంగా ఉన్నది ఒక్కటే, అది బ్రహ్మమే. కానీ ఆ బ్రహ్మం నీకు ప్రపంచంగా కనిపిస్తుంది. ఎండమావుల్లో నీళ్ళు లేవు, నీళ్ళు ఉన్నట్టు నీ మనసుకి కనిపిస్తున్నాయి. అలాగే బ్రహ్మంలో ప్రపంచం లేదు, కానీ ప్రపంచం ఉన్నట్టు నీ మనసుకి కనిపిస్తుంది. నిజంగా లేదు, నీ మనసుకి అది కనిపిస్తుంది. మనసు ఉన్నప్పుడు

కనిపిస్తుంది, మనసు లేనప్పుడు నువ్వే ఉన్నావు, బాహ్యంగా ఏమీ లేదు. అందుచేత ఉన్నది ఒక్కటే, అయితే మీరు, నేను అనే బేధబుద్ధి ఇదంతా మనసు యొక్క కల్పితం. జన్మించడం, మరణించడం ఇదంతా మనసు యొక్క కల్పితం. ఇవన్నీ తలంపులు, మరణించడం అనేది ఒక తలంపు, జన్మించడం అనేది ఒక తలంపు, ఇదంతా మనసు యొక్క కల్పితమే.

బ్రహ్మంలో మాయ లేదు, బ్రహ్మంలో సృష్టి లేదు, కానీ మాయ ఉన్నట్టు, సృష్టి ఉన్నట్టు నీ మనసుకి కనిపిస్తుంది. మనస్సు కనుక నశిస్తే మనస్సు కల్పించినవి అన్నీ కూడా నశించి అప్పుడు ఉన్న వస్తువు ఉన్నట్టుగా నీకు వ్యక్తం అవుతుంది. వాస్తవంలో ఈ మరణం కూడా కల్పితమే, ఈ జన్మ కూడా కల్పితమే. ఉన్నది ఒక్కటే వస్తువు, అది బ్రహ్మం, ఉన్నది ఉన్నట్టుగా నీకు ఎంతకాలం అయితే కనిపించదోఅంతకాలం ఈ సంసారం నిన్ను వెంటాడుతూ ఉంటుంది. సంసారం అనేది దీర్ఘరోగం, ఇది పెద్దరోగం. ఈ శరీరాన్ని స్మశానంలో దహనం చేసినప్పుడు సంసారం అనే రోగం కాలదు. నీ శరీరంలో ఎన్ని రోగాలు ఉన్నా స్మశానంలో కాలిపోతాయి కానీ ఈ సంసారం అనే రోగం నీకు స్మశానంలో కాలదు. ఎంతకాలం అయితే నీకు బేధబుద్ధి ఉందో, ఎంతకాలం అయితే నీకు అజ్ఞానం ఉందో, అవిద్య ఉందో, ఎంతకాలం అయితే ఉన్న వస్తువుని ఉన్నట్టుగా నువ్వు చూడలేవో, అంతకాలం ఈ జనన, మరణ చక్రంలో తిరగవలసిందే. నిన్ను బాధ విడిచిపెట్టదు, దుఃఖం విడిచిపెట్టదు అంటున్నారు ఆచార్యులవారు. ఉన్నది ఒక్కటే వస్తువు, ఆ ఉన్నది ఉన్నట్టుగా నీకు వ్యక్తం కావాలి. నీకు బేధబుద్ధి ఉంటే ఉన్న వస్తువు ఉన్నట్టుగా వ్యక్తం కాదు. నీ భయానికి బేధబుద్ధి కారణం, నీ కామానికి బేధబుద్ధి కారణం, తరువాత నీ దుఃఖానికి బేధబుద్ధి కారణం, నీ కోపానికి బేధబుద్ధి కారణం.

ఈ సృష్టిలో ఎవడు ఏ పని చేసినా కామక్రోధాల కోసమే పని చేస్తున్నాడు. ఒక్క జ్ఞాని తప్పించి, ఒక్క పరమాత్మ తప్పించి, మిగతా జీవకోటి అంతా పని చేస్తుంటే దానికి ఆధారం కామక్రోధాలే. కామం అంటే అక్కడ కోరిక. ప్రతీ మనిషి ఏదో ఒక కోరిక పెట్టుకునే పని చేస్తాడు. ఎవరైనా సరే వ్యవసాయదారులు అవ్వనివ్వండి, రాజకీయ నాయకులు అవ్వనివ్వండి, ఇంకొకళ్ళు అవ్వనివ్వండి, ఎవరైనాసరే కామక్రోధాల మీదే ఆధారపడి వాడు పని చేస్తున్నాడు. ఈ కామక్రోధాలను బట్టి వాడు పని చేస్తుంటే వాడిని కర్మ చుట్టుకుంటుంది, అంటే సంస్కారాల వల్ల కర్మ వస్తుంది, కర్మ వల్ల దేహం వస్తుంది, దేహం వల్ల దుఃఖం వస్తుంది. అంటే మీకు

దుఃఖం నశించాలి అంటే దేహం రాకూడదు. మీకు దేహం రాకుండా ఉండాలి అంటే కర్మ చెయ్యకూడదు అంటే కామక్రోధాల మీద ఆధారపడిన కర్మ చెయ్యకుండా ఉండాలి అంటే కామక్రోధాలు తగ్గాలి. కామక్రోధాలు నీకు తగ్గాలి అంటే నువ్వు ఎవడవో నీకు తెలియాలి. నువ్వు ఎవడవో నీకు తెలియనంతకాలం నీకు కామక్రోధాలు వస్తూనే ఉంటాయి. నువ్వు ఎవరవు? నువ్వు బ్రహ్మమే, నువ్వు బ్రహ్మం అన్న సంగతి నీకు తెలియకపోవచ్చు కానీ నువ్వు బ్రహ్మమే, నువ్వు ఎవరివో నీకు తెలియాలి.

మనకి మూడు వాసనలు చెప్పారు. ఈ మూడు వాసనలు నశిస్తేనే కానీ మన మనసు బ్రహ్మం వైపు తిరగదు. అంటే బ్రహ్మానుభవం కలగదు, ఆత్మజ్ఞానం కలగదు. ఎవడైతే మోక్షాన్ని కోరుకుంటున్నాడో వాడు ఆత్మజ్ఞానాన్ని కష్టపడి సంపాదించుకోవాలి. ఆత్మజ్ఞానం ఎవడికైతే లేదో వాడికి మోక్షం రాదు. మూడు వాసనలు అంటే లోకవాసన, శాస్త్రవాసన, దేహవాసన ఉన్నవాడికి మోక్షం రాదని చెప్పారు. లోకవాసన అంటే మీకు అసలు అర్థం అవ్వాలి కదా, లోకంలో ఏ వస్తువు మీద మనకి ప్రీతి ఉన్నా వాడికి లోకవాసన ఉన్నట్టే గుర్తు. రెండు దేహవాసన, అంటే దేహం మీద అభిమానం, దేహం మీద అపేక్ష. కొంతమందికి ఎంతసేపు పొట్టగొడవ, బట్టగొడవ, ఏమి తింటున్నాం, ఏమి కట్టుకుంటున్నాం, అదే గొడవ తప్ప జ్ఞానం ఏమి సంపాదించుకుంటున్నాం అనే గొడవ ఉండదు. వాడికి 24 గంటలు పొట్ట, బట్ట తప్పించి ఇంకేమి ఉండదు, దేహవాసన ఉన్నవాడికి ఎంతసేపు ఈ దేహం ఉంది, ఈ దేహం తోటి ఇంద్రియభోగాలు మనం అనుభవించాలి అని భోగదృష్టి ఎక్కువ ఉంటుంది. ఎవడికైతే వాడి దేహం మీద అపేక్ష ఎక్కువ ఉంటుందో, వాడికి దేహవాసన ఎక్కువ ఉన్నట్టు లెక్క. మూడు శాస్త్రవాసన, శాస్త్రవాసన ఉన్న వాడికి హృదయంలో ఉన్న సత్యాన్ని తెలుసుకోవాలి, హృదయంలో ఉన్న భగవంతుడిని తెలుసుకోవాలి అనే కోరిక ఉండదు. ఆ పుస్తకంలో ఒక మాట, ఈ పుస్తకంలో ఒక మాట చదివి ఆ మాటలను పట్టుకుని వాదించుకోవటం శాస్త్రవాసన. దానివల్ల ఏమీ కలిసిరాదు. వాళ్ళ బుద్ధి అక్కడి తోటి ఆగిపోతుంది. కోర్టులో ప్లీడర్లు ఏవిధంగా అయితే arguments చెబుతారో, ఈ శాస్త్రాలు చదువుకుని కొంతమంది arguments చెబుతారు కానీ, శాస్త్రంలో ఉన్న సారాన్ని హృదయంలో అనుభవిద్దాం అన్న బుద్ధి వాడికి కలగదు. అంటే శాస్త్రవాసన వాడికి కలుగనివ్వదు. భగవద్గీతలో ఇలా ఉంది, ఉపనిషత్తులో ఇలా ఉంది,

లేకపోతే బైబిల్ లో ఇలా ఉంది అని మాట్లాడుతూ ఉంటారు కానీ అందులో ఉన్న essence ఏమిటి అని చూడరు. శాస్త్రంలో ఏదైతే సారం ఉందో, అది మాటల తోటి సరిపెట్టకుండా, ఆ సారాన్ని మనం అనుభవంలోకి తెచ్చుకుందాం అన్న గుణం శాస్త్రవాసన ఉన్నవాడికి ఉండదు. ఊరికే పాండిత్యం తోటి సరిపెట్టుకొంటారు. వాళ్ళ హృదయంలో లోతులు ఉండవు, శబ్దాలను ఆడంబరంగా ప్రయోగిస్తూ ఉంటారు. శాస్త్రవాసన యొక్క గుణం ఇది. ఈ వాసనలు ఉన్నప్పుడు నీకు మోక్షానుభవం కలుగనే కలగదు. ఈ వాసనలు తొలగించుకుంటేనే కానీ నీ హృదయంలో ఉన్న వస్తువు నీకు వ్యక్తం కాదు.

ఆచార్యులవారు ఏమంటున్నారు అంటే బ్రహ్మంలో బేధం ఏమీ లేదు, నీ మనస్సులోనే బేధం ఉంది, హెచ్చుతగ్గులు అన్నీ కూడా నీ మనస్సు కల్పించే గారడీ. అందుచేత బేధం ఎంతకాలం అయితే నువ్వు చూస్తున్నావో అంతకాలం నీకు పునర్జన్మ తప్పదు, మరణం తప్పదు, బాధ తప్పదు, భయం తప్పదు అంటున్నారు ఆచార్యులవారు. అంటే ప్రతీజన్మలో ఏదో ఒక బాధ నిన్ను పీడిస్తూనే ఉంటుంది, భయం నిన్ను వెంటాడుతూనే ఉంటుంది, ఉన్నది ఒక్కటే వస్తువు. ఆ వస్తువు నీకు వ్యక్తం అవ్వాలి అంటే నీకు బేధబుద్ధి నశించాలి. ఉన్నవస్తువును ఉన్నట్టుగా చూడకుండా అందులో బేధాన్ని కనుక నువ్వు చూస్తుంటే, నీకు పునర్జన్మ వచ్చి తీరుతుంది. పునర్జన్మ వస్తే శరీరం వస్తుంది, శరీరం వస్తే దుఃఖం వస్తుంది. ఉన్నది ఒక్కటే, నువ్వు దానిని అనేకంగా చూస్తున్నావు. అంటే అర్థం ఏమిటి అంటే మన శరీరాలు ఇక్కడ



**ప్రహ్లాదుడికి నరసింహస్వామి దర్శనం ఇచ్చి నీకు ఏమి కావాలో కోరుకో అంటాడు. నువ్వు కనిపించాక, నువ్వే నాకు లభ్యమయినప్పుడు, అడగటానికి ఇంకా కోరికలు ఎక్కడ ఉన్నాయి అన్నాడు. హృదయం వెలితిగా ఉన్నప్పుడు కదా కోరికలు, హృదయం ఆనందంతో శాంతితో నిండిపోయినప్పుడు ఇంక కోరటానికి ఏముంది?**

ఉన్నాయి. ఈ శరీరాలకి రంగులు తేడా ఉండవచ్చు, ఈ శరీరాలకి వయసులు తేడా ఉండవచ్చు, శరీరాలలో ఎన్ని తేడాలు ఉన్నప్పటికీ హృదయంలో ఉన్న వస్తువు ఒక్కటే, బ్రహ్మమే. నువ్వు ఆ బ్రహ్మాన్ని చూడడం నేర్చుకో, నువ్వు గుణాలని కూడా చూడవద్దు. వాడు మంచివాడు, వీడు చెడ్డవాడు అనుకొంటాము. ఈ మంచి, చెడ్డగుణాలు ఏమీ కూడా ఆ గుణాలు కూడా బ్రహ్మంలో లేవు, మనస్సులో ఉన్నాయి.

బ్రహ్మంలో గుణం లేదు, అంటే మనం నిర్గుణ స్థితికి, నిరాకార స్థితికి ఎదిగి వెళ్ళాలి. మంచిగుణాలు ఉండాలి అని మన పెద్దవాళ్ళు చెబుతున్నారు. మంచిగుణాలు ఎందుకు ఉండాలి అంటే, మంచిగుణం ఉన్నవాడికి వాడి లోపలఉన్న బ్రహ్మం తెలియడానికి ఆ మంచిగుణం సహకరిస్తుంది. గుణాలు చివరి స్థితి కాదు. మాకు మంచిగుణాలు ఉన్నాయి కాబట్టి మాకు బ్రహ్మం తెలుసు అనుకోకూడదు. గుణాలు అన్నీ మనసుకి సంబంధించినవే. ఆచార్యులవారు ఏమంటున్నారు అంటే నువ్వు బ్రాహ్మీదృష్టితో చూస్తే, బ్రహ్మానుభవం తోటి చూస్తే అక్కడ గుణమే లేదు. బ్రహ్మంలో గుణం లేదు, అది నిర్గుణ స్థితి, నిరాకార స్థితి, నిరహంకార స్థితి, నిరాడంబర స్థితి, అక్కడ గుణాలు లేవు. గుణాలు యొక్క చేష్టలు అన్నీ కూడా మనసుకి సంబంధించినవే. ఈ మనస్సు ఎంత నిజమో, ఈ సమాజం ఎంత నిజమో, ఈ దేహం ఎంత నిజమో, ఈ గుణం కూడా అంతే నిజం కానీ బ్రాహ్మీదృష్టితో చూస్తే ఈ గుణం కూడా అసత్యమే. మిమ్మల్ని ఎవరైనా మంచివారు అంటారు అనుకోండి, మీకు ఏమి వస్తుంది? సంతోషం వస్తుంది. అంటే ఎవరు సంతోషిస్తున్నారు? మీ మనసు సంతోషిస్తుంది. మీ మనసు ఎంత నిజమో, ఈ గుణం కూడా అంతే నిజం. గుణం అనేది మనస్సుకి పరిమితమైనది అయితే మనం మంచిగుణాన్ని అలవాటు చేసుకోవాలి. మంచిగుణాలే పరమ స్థితి కాదు, మంచిగుణాలే గమ్యం కాదు. అయితే మంచిగుణాలు లోపల నువ్వు ఎవరవో నీ తత్త్వం తెలియడానికి సహకరిస్తాయి. చెడ్డగుణాలు నీ స్వరూపానికి దూరం తీసుకుపోతాయి. మంచిగుణాలు నీ స్వరూపం దగ్గరకి తీసుకువెళతాయి. అయితే నాలో ఏవో మంచిగుణాలు ఉన్నాయి అని అంతమాత్రం చేత నేను దేవుడిని అయిపోయాను అని, నాకు ఆత్మ తెలిసిపోయింది అని ఎవరూ అనుకోకూడదు. మంచిగుణం అనేది బ్రహ్మాన్ని తెలుసుకోవడానికి సహకరించే సంపద లాంటిదే కానీ నిజం కాదు. అయితే బ్రహ్మంని తెలుసుకోవడానికి సద్గుణాలు సహకరిస్తాయి.

మీలో ఎంతకాలం అయితే బేధబుద్ధి ఉందో అంతకాలం మీకు భయం వెంటాడుతూ ఉంటుంది. భయం వలన బానిసత్వం వస్తుంది, భయం వలన అనారోగ్యం వస్తుంది. తత్త్వం ఎవడికి అయితే తెలిసిందో వాడు మటుకే భయంలోంచి విడుదల పొందుతాడు. ఆత్మజ్ఞానం ఎవడికైతే కలిగిందో వాడే అభయ స్థితిని పొందుతాడు. అంటే భయం లేని స్థితిని పొందుతాడు. గీతాంజలిలో ఠాగూర్ ఏమని చెప్పాడు అంటే ఎక్కడ భయం లేదో అక్కడకి నన్ను మేల్కొలుపు తండ్రి అన్నాడు. భయం వల్ల దుఃఖం వస్తుంది, అభయస్థితిలో వాడు సుఖాన్ని పొందుతాడు. ఎక్కడ భయం లేదో అక్కడకి నన్ను మేల్కొలుపు అంటే ఆత్మలో భయం లేదు అంటే నాకు ఆత్మజ్ఞానాన్ని ప్రసాదించమని చెప్పకుండా చెప్పడం.

ఈ ప్రపంచం మిథ్య అని, ప్రపంచం అశాశ్వతం అని, ప్రపంచం అసత్యం అని పెద్దలు చెబుతున్నారు, పెద్దలు, శాస్త్రాలు, మహాత్ములు, మహర్షులు ఏదైతే అసత్యం అని చెబుతున్నారో, ఏదైతే నిజం కాదు అని చెబుతున్నారో, దానితో నువ్వు తాదాత్మ్యం పొందుతూ నాకు మోక్షం కావాలి అంటే నీకు ఎక్కడ నుంచి వస్తుంది మోక్షం అంటున్నారు ఆచార్యులవారు. ఆచార్యులవారు ఏమంటున్నారు అంటే, ఈ లోకం నిజం కాదు, నీ మనసుకి నిజంలా కనిపిస్తోంది. అంటే నీ చేత చూడబడేది ఏది నిజం కాదు. నీ మనస్సు నీ చేత చూడబడుతోంది, నీ బుద్ధి నీ చేత చూడబడుతోంది, నీ కామక్రోధాలు నీ చేత చూడబడుతున్నాయి, నీ రాగద్వేషాలు నీ చేత చూడబడుతున్నాయి, ప్రపంచం నీ చేత చూడబడుతోంది. సమస్తం ఏదైతే నీ చేత చూడబడుతోందో అది నిజం కాదు, ఏదైతే నీ చేత చూడబడుతోందో దానితోటి నువ్వు తాదాత్మ్యం పొందుతున్నావు. అలా తాదాత్మ్యం పొందకు అని శాస్త్రాలు, పురాణాలు చెబుతున్నాయి, మహర్షులు, మహాత్ములు చెబుతున్నారు అయినా ఆ బుద్ధి నీకు పోవడం లేదు అంటున్నారు ఆచార్యులవారు. నువ్వు కాని దేహం తోటి, నువ్వు కాని లోకం తోటి, నువ్వు కాని రంగు తోటి, నువ్వు కాని తెలివి తోటి తాదాత్మ్యం పొందుతున్నావు. తెలివి అవసరమే కానీ తెలివి కూడా నిజం కాదు. ఎందుచేత అంటే మీ తెలివి కూడా మీ చేత చూడబడుతోంది. మీ చేత చూడబడే దృశ్యం ఏదీ నిజం కాదు. ఏదైతే మీచేత చూడబడుతోందో అదంతా గాఢనిద్రలో అణిగిపోతోంది. మనసు వచ్చాక ఇవన్నీ వస్తున్నాయి, మనస్సు అణిగిపోతే ఇవన్నీ కూడా అణిగిపోతున్నాయి. ఏదైతే నువ్వు కాదని శాస్త్రం చెబుతోందో, దానితోటి నువ్వు తాదాత్మ్యం

పొందుతున్నావు. ఆ తాదాత్మ్యం లోంచి నువ్వు విడుదల పొందలేక పోతున్నావు, అలా నువ్వు విడుదల పొందలేనంత కాలం నీకు మోక్షం కూడా రాదు, నీకు స్వరూపసుఖం తెలియదు. మోక్షంలో ఆనందం ఉంది, మోక్షంలో శాంతి ఉంది, మోక్షంలో సుఖం ఉంది, కానీ నువ్వు కానిదానితోటి నువ్వు తాదాత్మ్యం పొందుతున్నంత కాలం ఆ మోక్ష సుఖం నీకు తెలియదు అంటున్నారు ఆచార్యులవారు.

లోకాన్ని చూసి మనకి మోహం కలుగుతుంది. ఈ లోకాన్ని చూసి మనకి మోహం ఎందుకు కలుగుతోంది అంటే లోకాన్ని చూసి మనం భ్రాంతి పడుతున్నాం అందుచేత దానిమీద మోహం కలుగుతోంది. భగవాన్ అక్షరమణమాలలో ఏమని చెప్పారు అంటే, ఈ లోకం యొక్క మోహం నేను పోగొట్టుకోవడానికి నీ మోహంలో పడ్డాను. నీ మీద మోహం నాకు పోతేనే కానీ వేరుబుద్ధి నశించదు. వేరుబుద్ధి నశిస్తేనే కానీ నాకు తత్త్వం తెలియదు. అందుచేత నీ మీద నాకు మోహం పోయేలాగ నువ్వే చెయ్యాలి. నువ్వు వేరు, నేను వేరు అనే వేరుబుద్ధి ఉన్నంత కాలం నాకు తత్త్వం తెలియదు, తత్త్వం తెలిస్తేనే కానీ సుఖం తెలియదు, అందుచేత నీ మీద ఉన్న మోహం నువ్వే పోగొట్టాలి.

రమణ మహర్షి గారు ఎక్కువగా ఏమని చెబుతారు అంటే, నువ్వు కానిదాని గురించి ఆలోచించకు, నువ్వు కానిదాని కోసం ఎంత ఆలోచించినా అది నువ్వు అవ్వవు. ఒక్క ఆత్మచింతన తప్పించి ఇతర చింతలు కొంచెం కూడా పుట్టకుండా చూసుకో, నిరంతరం ఆత్మనే చింతించు, నిరంతరం భగవంతుడినే చింతించు, నీలో ఇతరచింతలు పుట్టడానికి, ఇతర ఆలోచనలు పుట్టడానికి అవకాశం ఇవ్వకు. అంటే నీకు తెలిసున్నా, నీకు తెలియకపోయినా నువ్వు బ్రహ్మమే. అది ఎవరో కాదు నీవే అయ్యి ఉన్నావు. బ్రహ్మంను నిరంతరం చింతించగా, చింతించగా అదే నువ్వు అన్న సంగతి నీకు తెలుస్తుంది. నువ్వు ఏమార్గంలో ప్రయాణం చేసినా, ఏ మతంలో ఉన్నా, భావనాబలం లేకుండా బ్రహ్మంని పొందలేవు అన్నారు రమణస్వామి. మనకు భావనాబలం ఉండాలి. మనం ఇక్కడ కూర్చోవాలి అనుకోండి మనకి శక్తి ఉండాలి, నిలబడాలి అనుకోండి శక్తి ఉండాలి, కొంతమందికి నుంచోడానికి కూడా ఓపిక ఉండదు, నడవడానికి కూడా ఓపిక ఉండదు, మంచం మీద నుంచి లేవడానికి కూడా కొంతమందికి ఇంకొకరి సహాయం ఉండాలి. శక్తి సరిపోకపోతే అంతే కదా. నీకు శరీరం ఉన్నప్పటికీ, శరీరంలో శక్తి

లేకపోతే నువ్వు అటు ఇటు తిరగలేవు. అదే విధంగా నీ హృదయంలో బ్రహ్మం ఉన్నప్పటికీ నీకు భావనాబలం కనుక లేకపోతే దానిని తెలుసుకోలేవు. ఆ భావనాబలం ఉండాలి, ఆ భావనాబలం నువ్వు భక్తిమార్గంలో పెంచుకో, లేకపోతే జ్ఞానమార్గంలో పెంచుకో, లేకపోతే కర్మమార్గంలో పెంచుకో, నువ్వు భక్తిమార్గంలో ప్రయాణం చేసినా, ధ్యానమార్గంలో ప్రయాణం చేసినా, జ్ఞానమార్గంలో ప్రయాణం చేసినప్పటికీ నువ్వు ముందు ఈ భావనాబలం రావాలి. భావనాబలం రావాలి అంటే ఊరికే రాదు, నీలోని కామక్రోధాలు పల్చబడాలి, కామక్రోధాలు పల్చబడితేనే కానీ భావనాబలం రాదు.

కోరిక తోటి పనిచేసేవాడికి కామక్రోధాలు పెరుగుతూ ఉంటాయి. కోరిక లేకుండా పనిచేసే వాడికి కామక్రోధాలు తగ్గుతూ ఉంటాయి. మీకు అర్థం అవుతోందా? మీరు ఆయుర్వేద మందు వాడినా, హోమియోపతి మందు వాడినా, ఇంగ్లీషు మందు వాడినా రోగం తగ్గుతోందో, లేదో చూసుకోండి, అదేవిధంగా మీరు ఏమార్గంలో ప్రయాణం చేసినా, భక్తిమార్గంలో ప్రయాణం చేసినా, జ్ఞానమార్గంలో ప్రయాణం చేసినా, కర్మమార్గంలో ప్రయాణం చేసినా, విచారణామార్గంలో ప్రయాణం చేసినా, లేకపోతే ప్రాణాయామం చేసినా మీ కామక్రోధాలు ఎంతవరకు తగ్గుతున్నాయో చూసుకోండి అంటున్నారు ఇక్కడ భగవాన్. మాకు రోగం తగ్గినా ఫరవాలేదు, తగ్గకపోయినా ఫరవాలేదు మందులు వాడుతున్నాం అంటే కుదరదు, రోగం తగ్గుతోందో, లేదో చూసుకోవాలి. అలాగే మీరు ఏమార్గంలో ప్రయాణం చేసినా సరే కామక్రోధాలు తగ్గాలి. కామక్రోధాలు తగ్గకపోతే నీకు దేహాలు ఆగవు. ఈ దేహం ఎవరిది? మృత్యుదేవతది, కాని మనం నాది నాది అనుకుంటున్నాము. మీకు ఇష్టం ఉన్నా, ఇష్టం లేకపోయినా ఏదో ఒకరోజున మరణం వస్తుంది, మరణం వచ్చి ఈ దేహాన్ని పట్టుకుని పోతుంది. ఇది ఎలా ఉంది అంటే ఎక్కడో ఒక వస్తువు దొంగతనం చేసి తెచ్చి మన ఇంట్లో పెట్టి, ఈ వస్తువు నాది, ఈ వస్తువు నాది అనుకోవడం ఎలా ఉంటుందో ఈ దేహం నాది, ఈ దేహం నాది అనుకోవడం కూడా అలాగే ఉంది. నీదైతే ఎందుకు చచ్చిపోతున్నావు అన్నారు ఆచార్యులవారు.

ఒక రాజుగారు ఉన్నారు, ఆయన ఇల్లు అంటుకుంది, ఇల్లు అంటుకుంటే మీరు ఏమి చేస్తారు? ఆ ఇంట్లోంచి రాజుగారిని వెంటనే బయటకు తీసుకొనిరావటానికి చూస్తారు. అంతేకానీ ఇల్లు అంటుకుపోయినా ఫరవాలేదు, పల్లకి వచ్చిన తరువాత, ముస్తాబు చేసిన

తరువాత రాజు గారిని పల్లకిలో కూర్చోబెడదాం అని ఎవరు అనుకోరు. అదేవిధంగా మీరు చావడానికి సిద్ధంగా ఉన్నారు, రాజుగారిని అంటుకున్న ఇంట్లోంచి వెంటనే ఎలా బయటకి తీసుకుని వస్తామో, అంత తొందరగా మీరు బాగుపడాలి. ఇల్లు ఒక పక్క అంటుకుపోతోంది, రాజుగారు కాలిపోవడానికి సిద్ధంగా ఉంటే, పల్లకి వచ్చిన తరువాత రాజుగారిని బయటకి తీస్తాం అంటే ఎలా ఉంటుందో, మేము సాధన రేపు చేసుకుంటాం, రేపు చేసుకుంటాం, సాధన చేసుకోవడానికి ఇంకా టైం ఉంది అనుకోవడం అలాగే ఉంటుంది. దేహం చచ్చిపోవడానికి సిద్ధంగా ఉంది, ఎంతకాలం సాధన లేకుండా మీ కాలాన్ని దుర్వినియోగం చేసుకుంటారు. మీరేమి సాధన చెయ్యడం లేదు, బ్రహ్మానుభవం పొందడానికి ఏమీ ప్రయత్నం చెయ్యడం లేదు.

నువ్వు భగవంతుడిని తెలుసుకోవడానికి ప్రయత్నం చెయ్యి, బ్రహ్మానుభవం పొందడానికి ప్రయత్నం చెయ్యి. నీ బుద్ధి తోటి, నీ చమత్కారాల తోటి, నీ అనుభవాల తోటి నువ్వు కాలక్షేపం చెయ్యకు. నీ బుద్ధి ఒక మాయ, నీ మనస్సు కూడా మాయే, ఇదంతా జడం. బుద్ధి ఎంత అసత్యమో, బుద్ధికి కలిగే అనుభవాలు కూడా అంతే అసత్యం, నీ బుద్ధిని బట్టి నువ్వు నడుచుకోవద్దు, పరమాత్మ ఏ మాట అయితే చెప్పాడో, ఆ మాటని ప్రమాణంగా తీసుకుని దానిని ఆచరించడానికి, అనుభవంలోకి తెచ్చుకోవడానికి ప్రయత్నం చెయ్యి. పరమాత్మ చెప్పిన మాటని అర్థం చేసుకోవడానికి నీ బుద్ధిని ఉపయోగించవచ్చు. పరమాత్మ మాట ఫైనల్ కానీ, బుద్ధి ఫైనల్ కాదు. ఇది బాగా అర్థం చేసుకోండి. భగవంతుడు ఒక మాట చెప్పాడు అనుకోండి, ఆ మాటకి విరుద్ధంగా మీ బుద్ధి పనిచేస్తోంది అనుకోండి, ఆ మాటకి విరుద్ధంగా మీ బుద్ధికి సంబంధించిన అనుభవం ఉంది అనుకోండి అప్పుడు మీ అనుభవం ఒక పక్కన పెట్టి అంటే దోషాల తోటి కూడినటువంటి మీ బుద్ధికి సంబంధించిన అనుభవాలని ఒక

**మానవుడికి దుఖం వస్తోంది అంటే దానికి బయట అసలు కారణాలు ఏమీ లేవు. ఎక్కడ అహంభావన లేదో, ఎక్కడ వ్యక్తిభావన లేదో అక్కడికి మనం చేరుకుంటే, మనం దుఃఖరహిత స్థితిని పొందుతాము.**



పక్కన పెట్టి, భగవంతుడు చెప్పిన మాటని ప్రమాణంగా తీసుకుని నువ్వు ప్రయాణం చెయ్యి. అంతేకానీ నా బుద్ధి ఇలా చెప్పింది అని నువ్వు వెళ్ళకు, నీ బుద్ధి నిజం కాదు, అది జడం. జన్మాంతరం నుంచి అనేక బలహీనతలు, అనేక దోషాలు ఆ బుద్ధిలో ఉన్నాయి. ఈ పాడు బుద్ధి నీకు దారి చూపిస్తుందా? అందుచేత నువ్వు భగవంతుడు చెప్పిన మాటలని ప్రమాణంగా తీసుకోవాలి కానీ నా బుద్ధికి అనుభవం ఇలా ఉందని గంతులు వేయకు. నీ బుద్ధిని ఒక పక్కన పెట్టి భగవంతుడి మాటని అంగీకరించమంటున్నారు ఆచార్యులవారు.

భగవంతుడు ఏ పని అయితే చెయ్యవద్దు అని చెబుతున్నాడో, ఆ పనులు మనం చెయ్యకూడదు. ఏదైతే ఆచరించమని చెబుతున్నాడో అది ఆచరించాలి. ఆయన చేయమన్న పని మనం చెయ్యడమే, వద్దన్న పని మనం మానేయడమే! నీ బుద్దే ప్రమాణం కాదు, నా బుద్ధి ఇలా చెబుతోంది, నేను ఇలా చేశాను అని అనుకోకు. భగవంతుడు చెప్పిన మాటలని ప్రమాణంగా తీసుకో, అది ఇక్కడ ఆచార్యులవారు చెప్పేది. నాకేదో తోచింది నేను మాట్లాడేశాను అలా కాదు, నీ మాటకి సంస్కారం ఉండాలి, నీ ప్రవర్తనకి సంస్కారం ఉండాలి, భగవంతుడు చెప్పినట్టుగా నడుచుకుంటే జీవితం సుఖంగా వెళ్ళిపోతుంది, నీకు మోక్షం కలుగుతుంది. ఈ కళ్ళు బయట ఇంద్రియాలు, చెవులు బయట ఇంద్రియాలు. మనస్సు కూడా ఇంద్రియమే, అంతర ఇంద్రియం, అంటే లోపల ఉండే ఇంద్రియం. ఆ లోపల ఉన్నటువంటి ఇంద్రియం తోటి నీకు ఎంతకాలం అయితే సంగమం ఉందో అంతకాలం నువ్వు బాగుపడవు. లోపల ఉన్నటువంటి మనస్సు తోటి, అహంభావన తోటి, మమకారం తోటి, ఈ నేను తోటి, నాది తోటి ఎంతకాలం అయితే నీకు attachment ఉందో, అంతకాలం నీకు spiritual maturity రాదు, ఇది ఆచార్యులవారు చెప్పేది. అంటే నువ్వు పక్వానికి రావు, ముందు పండు పక్వానికి రావాలి, పక్వానికి వచ్చినది ముగ్గుతుంది, పక్వానికి రాకపోతే అది ముగ్గదు. అదేవిధంగా నువ్వు ముందు పక్వానికి రావాలి. నువ్వు పక్వానికి ఎప్పుడు వస్తావు? నీ లోపల ఉన్నటువంటి మమకారం తోటి, అహంకారం తోటి సంబంధం వదిలేస్తే, దానితోటినీకున్నఅటాచ్మెంట్ వదిలేస్తే నువ్వు తప్పనిసరిగా పక్వానికి వస్తావు. పక్వానికి వచ్చిన తరువాత ముగ్గుతావు, ముగ్గుతావు అంటే మోక్షం వస్తుంది.

ధ్యానం చెయ్యడం వలన మనసు సంస్కరింపబడుతుంది, రాగద్వేషాలు తగ్గుతాయి. మీరు ధ్యానం చేస్తున్నారు అనుకోండి, మీకు రాగద్వేషాలు తగ్గడం లేదు అనుకోండి, ఏమీ

ప్రయోజనం లేదు. జీవితం పొడవునా నువ్వు నిష్కామకర్మ చెయ్యి, ధ్యానం చెయ్యి, లేకపోతే పూజ చెయ్యి, లేకపోతే జపం చెయ్యి. జపం కూడా మంచిదే, జపం వలన భగవంతుడి తోటి నీకు అనుబంధం ఏర్పడుతుంది. మనం జపం, ధ్యానం మానకూడదు. భగవంతుడి రూపం కంటే, భగవంతుడి పేరు గొప్పది అని చెపుతారు. కొంతమంది రాముడు ఇప్పుడు లేడు, కృష్ణుడు ఇప్పుడు లేడు అలా అనుకుంటారు. అలా కాదు, దేవుడు ఎప్పుడూ ఉన్నాడు, వాడి రూపం ఇప్పుడు లేకపోవచ్చు దేవుడు ఎప్పుడూ కూడా ఉన్నాడు. అయితే మనకి దేవుడికి తేడా ఏమిటి? భగవంతుడికి దేహం కావాలి అనుకోండి స్వేచ్ఛగాతీసుకుంటాడు, వదిలేసినప్పుడు కూడా స్వేచ్ఛగా వదిలేస్తున్నాడు. మనం ఏడుస్తూ దేహం తీసుకుంటాం, ఏడుస్తూ దేహం వదిలేస్తాం. ఎందుచేత అంటే మనవి కర్మని బట్టి వచ్చిన దేహాలు. దేహంలో ఉన్నప్పుడు కూడా తాను దేహమాత్రుడు కాదు అన్న సంగతి భగవంతుడికి తెలుస్తూ ఉంటుంది, వాడు భగవంతుడు అంటే. వాడు దేహంలోనే ఉంటాడు, కానీ వాడు దేహమాత్రుడు కాదు అని వాడికి తెలుస్తూనే ఉంటుంది. మన జన్మకి, భగవంతుడి జన్మకి తేడా ఉంది. కృష్ణుడు పుట్టాడు, మనం పుట్టాం అనుకోకండి, అలా కాదు. మనవి కర్మానుభవం కోసం వచ్చిన దేహాలు, ఆయనది స్వేచ్ఛగా అవసరం కోసం పుట్టించుకున్న దేహం.

అందుచేత నువ్వు జపం చెయ్యి, భగవంతుడి రూపం కంటే కూడా నామం గొప్పది. నామం నిరంతరం చెయ్యడం వలన నీకు ఆ దేవతా స్వరూపుడు తోటి మానసిక అనుబంధం, మెంటల్ అటాచ్మెంట్ ఏర్పడుతుంది, దాని వలన మనసు పవిత్రం అవుతుంది. భగవంతుడిని స్మరించగా, స్మరించగా, స్మరించగా! అంటే ఇప్పుడు ఇవన్నీ ఎందుకు అంటారు? మనం పూజ చేస్తున్నాం, చెయ్యండి కానీ తెలిసి చెయ్యండి. మనం పూజ చేస్తున్నాం, జపం చేస్తున్నాం, అలాగే ధ్యానం చేస్తున్నాం. వీటి అన్నిటి యొక్క ప్రయోజనం ఏమిటి అంటే అంతఃకరణశుద్ధి పడడం కోసం, హృదయం శుద్ధి పడడం కోసం. మనం రోజూ సబ్బు పెట్టి స్నానం చేస్తున్నాం, ఎందుకు? శరీరం శుభ్రం అవ్వడం కోసం. అంతేకదా, అలాగే పూజ యొక్క, జపం యొక్క, ధ్యానం యొక్క, విచారణ యొక్క ఫలితం ఏమిటి అంటే మనస్సు శుద్ధిగా ఉంటుంది, హృదయం శుద్ధిగా ఉంటుంది. హృదయ శుద్ధి కలవారు ధన్యులు, వారు దేవుడిని చూచెదరు అని బైబిల్‌లో చెప్పారు. దేవుడు ఉన్నాడు కానీ మీకు కనపడడు, నాకు కనపడడు. ఎవరు

దేవుడిని చూస్తారు అంటే యేసు ఏమన్నాడు అంటే హృదయశుద్ధి కలవారు దేవుడిని చూస్తారు. పూజ, జపం, ధ్యానం ఇవి అన్నీ హృదయశుద్ధి కోసం చేస్తున్న సంగతి మీకే తెలియడం లేదు, మెకానికల్ గా చేస్తున్నారు కాఫీ తీసుకున్నట్టు, అన్నం తిన్నట్టు. పూజ యొక్క ప్రయోజనం, జపం యొక్క ప్రయోజనం, ధ్యానం యొక్క ప్రయోజనం, విచారణ యొక్క ప్రయోజనం ఏమిటి అంటే మన అంతఃకరణం శుద్ధి పడడం కోసం, హృదయం శుద్ధి కావడం కోసం. పూజ, జప, ధ్యాన, విచారణల ద్వారా మీ మనసు ఎప్పుడైతే, మీ హృదయం ఎప్పుడైతే శుద్ధి పడిందో అప్పుడు మీ హృదయంలోని భగవంతుడు మీకు ఎరుక పడతాడు.

మీరు సాధన చేసుకోండి, మీ సాధన నాకు అక్కర్లేదు. మీరు చేసిన సాధన మీకే ఇచ్చేస్తాను. ఏదో ఒక దేహంలో మీరు పూజ, జపం, ధ్యానం, విచారణ మానకుండా చేస్తుంటే, మీ హృదయంలో నేనే ఉన్నాను కదా, మీ సాధనా బలంగా ఏదో ఒక జన్మలో, ఏదో ఒక దేహంలో మీరు ఉండగా, మీ హృదయంలో నేను ఎరుక పడుతాను అన్నాడు గీతలో పరమాత్మ. మీ హృదయంలో నేను ఉన్నాను, కాలక్రమంలో మీరు సాధన చేయండి, తొందర పడకండి. మీ హృదయంలో ఉన్న దోషాలు పూజ ద్వారా, ధ్యానం ద్వారా, జపం ద్వారా ఎప్పుడైతే బయటకి వచ్చేసాయో అప్పుడు నీకు ఎరుక పడతాను. హృదయ శుద్ధి కలవారు ధన్యులు, వారు దేవుడిని చూచెదరు. అందుచేత నువ్వు నిష్కామకర్మకి, ధ్యానానికి, జపానికి నీ జీవితాన్ని అంకితం చేసుకోవాలి.

నువ్వు బ్రహ్మంను ధ్యానం చెయ్యడం మంచిదే. బ్రహ్మంను డైరెక్ట్‌గా ధ్యానం చేస్తే నువ్వు పవిత్రుడివి అవుతావు, అప్పుడు నీకు స్వరూపం వ్యక్తం అవుతుంది. అలా చేయలేవు అనుకో, అంటే ఆత్మచింతన చేయలేవు అనుకో, బ్రహ్మం నువ్వు స్తుతించలేవు అనుకో, దానిమీద ధ్యాస నీకు కలగలేదు అనుకో, ధ్యాస లేకుండా ధ్యానం కలగదు. ఏ వస్తువుని అయితే మీరు ధ్యానం చెయ్యాలి అనుకుంటున్నారో ఆ వస్తువు మీద ముందు మీకు ప్రీతి ఉండాలి, ఇష్టం ఉండాలి, ప్రేమ ఉండాలి, ఉంటే అప్పుడు దాని మీద ధ్యాస కలుగుతుంది. ధ్యాస వల్ల ధ్యానం వస్తుంది, ధ్యాస లేకపోతే ధ్యానం కలగదు, ధ్యాస ఉంటే నీకు అక్కర్లేకపోయినా ధ్యానం వచ్చేస్తుంది. లోపల ప్రీతి లేనప్పుడు ధ్యాస రాదు, ఆ ధ్యాస లేనప్పుడు మీకు ధ్యానం కలగదు. మీరు బ్రహ్మంను ధ్యానం చెయ్యలేకపోతే ఒక అవతార పురుషుడిని ఎవరినైనా మీకు రాముడు

ఇష్టం అయితే రాముడిని, కృష్ణుడు ఇష్టం అయితే కృష్ణుడిని, మీకు ఏ రూపం ఇష్టం అయితే ఆ రూపాన్ని మీరు ధ్యానం చేసుకోవడం వలన హృదయ శుద్ధి మీకు కలుగుతుంది. నీ హృదయం ఎలా పరిశుద్ధం అవుతుంది? నువ్వు కామక్రోధాల లోంచి, రాగద్వేషాలలోంచి, అసూయ లోంచి విడుదల పొందినప్పుడు కాని నువ్వు పరిశుద్ధుడివి కావు. ఆచార్యులవారు చెప్పేది ఏమిటి అంటే, నువ్వు ఏమార్గంలో ప్రయాణం చేసినా నువ్వు ఎంతవరకు బాగుపడుతున్నావు? ఎంతవరకు హృదయ శుద్ధి కలుగుతోంది? అది చూసుకో!

భగవాన్ ఒక మాట చెప్పారు. వస్తువు ఎదురుగా ఉన్నప్పటికీ కళ్లు లేనివాడు ఏమి చూస్తాడు? వస్తువు ఎదురుగా ఉన్నా కళ్లు లేకపోతే అది కనపడదు. అలాగే మనకి అర్హత లేనప్పుడు, యోగ్యత లేనప్పుడు వస్తువు ఎదురుగా ఉన్నా తెలియదు. మీరు గుడ్డివారు అనుకోండి, వస్తువు ఎదురుగా ఉంది, కానీ గుడ్డివాడికి వస్తువు కనపడదు. కానీ వాడు కనపడడం లేదు కాబట్టి లేదు అనుకుంటాడు, మన పని కూడా అలాగే ఉంది. మీరు నరసాపురం గోదావరిదగ్గరకి వెళ్లి చూడండి, ఆ నదిలో నీరు ఏమన్నా ఒక నిమిషం ఆగుతుందా? ఆగదు. ఆ నదిలో నీరు అలా ప్రవహిస్తూనే ఉంటుంది. ఆ నదిలో నీరు ఎలా ప్రవహిస్తుందో అలాగే భగవంతుడి కృప 365 రోజులు, 24 గంటలు కూడా అలా ప్రవహిస్తూనే ఉంటుంది. నీరు ఏవిధంగా అయితే ప్రవహిస్తుందో, దేవుడి అనుగ్రహం కూడా అలా ప్రవహిస్తుంది. కానీ నీకు అర్హత లేని మూలాన, యోగ్యత లేని మూలాన, ఆ రుచి తెలియని మూలాన నువ్వు దానిని అందుకోలేక పోతున్నావు. దానికే భగవాన్ అంటారు కొంతమంది కళ్లు ఉండి చూడలేరు, చెవులు ఉండి వినలేరు. అంటే మీకు గ్రహించే బుద్ధి లేనప్పుడు ఎదురుగా వస్తువు ఉన్నా మీకు కనపడదు. ఆచార్యులవారు "మహాత్ముల తోటి సహవాసం రుచే నీకు తెలియనప్పుడు ఇంక నీకు మోక్షం ఏమిటిరా?" అన్నారు. దేవుడి అనుగ్రహం ఎప్పుడూ ఉంది, అంటే కృష్ణుడు ఉన్నప్పుడే దేవుడి అనుగ్రహం ఉంది, రాముడు ఉన్నప్పుడే దేవుడి అనుగ్రహం ఉంది, ఇప్పుడు లేదు అనుకోకండి. దేవుడి అనుగ్రహం ఎప్పుడూ ఉంది, నిరంతరం ప్రవహిస్తూ ఉంది, దానిని అందుకునే శక్తి, దానిని అందుకునే యోగ్యత మనం సంపాదించాలి. అనుగ్రహం అనే ప్రవాహాన్ని, దేవుడి యొక్క కరుణ అనే ప్రవాహాన్ని అందుకునే శక్తి మనం సంపాదించాలి.

మనకు ఇష్టంలేని సంఘటనలు ఏమైనా జరిగాయి అనుకోండి దేవుడి అనుగ్రహం

మా మీదలేదు అందువల్ల అలా జరిగాయేమో అనుకుంటారు మీరు, అది ఎందుకు అలా జరిగింది అంటే మీ కళ్లు తెరిపించడం కోసం, మీ హృదయం యొక్క లోతులు పెంచడం కోసం, ఒక్కొక్కసారి తలుపు సందులో పెట్టి మిమ్మల్ని నొక్కుతూ ఉంటాడు భగవంతుడు. ఆ తలుపు సందులో పెట్టి నొక్కినప్పుడు దేవుడి అనుగ్రహం మాకు లేదు అనిమీరు అనుకుంటారు. దేవుడి అనుగ్రహం మీకు ఎలా ఉందో తెలియడం కోసం తలుపు సందులో పెట్టి నొక్కుతూ ఉంటాడు. ఇప్పుడు మీకు ఏదైనా బాధ కలుగుతోంది అనుకోండి ఆ బాధ ఈశ్వరుడే పంపిస్తూ ఉంటాడు. కారణం లేకపోయినా ఒక్కొక్కసారి పంపిస్తూ ఉంటాడు మిమ్మల్ని మేల్కొలపడం కోసం. మనమీద కరుణ చూపించి అది పంపిస్తున్నాడు అనే విషయం మీకు తెలియదు. అది మీకు తెలియక ఏమనుకుంటారు? దేవుడి కరుణ మన మీద లేదు అనుకుంటారు. మీకు ఇష్టం లేని సంఘటన ఏదైనా జరిగితే మీకు బాధ కలుగుతుంది, మీకు అర్థం అవుతోందా? ఆ బాధ పడేది ఎవరు? మనస్సు. ఇక్కడ ఉందండి భగవాన్ టీచింగ్ యొక్క గొప్పతనం. అసలు నీ మనస్సు ఎంత నిజమో, ఆ బాధ అంతే నిజం, రెండూ నిజం కాదు. మనసు ఎంత అసత్యమో మనసుకి వచ్చిన బాధ కూడా అంతే అసత్యం. ఆ బాధ మీకు ఎందుకు వస్తుంది అంటే మనసు యొక్క గూట్లోంచి నిన్ను బయటకి లాగి బ్రహ్మానుభవం కలుగజేయడం కోసం పంపిస్తున్నాడు. ఆ బాధ చూసి నువ్వు కంగారు పడకు, నీ మనసు ఎంత అసత్యమో ఆ బాధ కూడా అంతే అసత్యం. ఆ టీచింగ్ లో ఉన్న వైభవం చూడండి. మీకు ఏదైనా కష్టం రావచ్చు, ఆ కష్టం వస్తే మీరు కంగారు పడిపోతారు. మనసు ఎంత అసత్యమో, ఆ కష్టం కూడా అంతే అసత్యం. కానీ నువ్వు మనసు నిజం అనుకుంటున్నావు కాబట్టి కష్టం కూడా నిజం అని అనిపిస్తుంది. కష్టం కూడా నీకు ఈశ్వరుడే పంపిస్తున్నాడు ఎందుచేత అంటే నీ మనసు లోంచి నిన్ను విడుదల చెయ్యడం కోసం అలా చేస్తున్నాడు. భగవంతుడు గీతలో చెప్పాడు మంచి చేసిన వాడికి దుర్గతి లేదని. అందుచేత నువ్వు మంచి కర్మ చెయ్యగా, చెయ్యగా, ధ్యానం చెయ్యగా, చెయ్యగా, విచారణ చెయ్యగా, చెయ్యగా జపం చెయ్యగా, చెయ్యగా, నీకు హృదయశుద్ధి కలుగుతుంది. జపం అన్నిటికంటే తేలిక, ఖర్చు లేని పని. ఏదైనా యజ్ఞం చెయ్యాలి అంటే మనకి ఖర్చు ఉంటుంది, జపానికి ఏమీ ఖర్చు లేదు. పూజ కంటే తేలిక జపం. పూజ అంటే పువ్వులు కావాలి, ఒక దండ

తేవాలి, అగరవత్తులుతేవాలి, బోల్డంత గొడవ ఉంది. జపానికి ఇంక ఏమీ ఖర్చు లేదు. పువ్వులు కూడా అక్కర్లేదు, అన్ని యజ్ఞాలలో జప యజ్ఞం నేను అన్నాడు కృష్ణుడు గీతలో, అది కూడా యజ్ఞమే!

ఎవడైతే తాను కానిదానిని చింతిస్తూ, తాను కానిదానితోటి తాదాత్మ్యం పొంది జీవిస్తూ ఉంటాడో వాడు ఏనాటికైనా నశించిపోతాడు అంటున్నారు ఆచార్యులవారు. ఏదైతే అవునో దానిని తెలుసుకోకుండా, నువ్వు కానిదానినే చింతిస్తూ, నువ్వు కానిదానినే ధ్యానిస్తూ ఉంటే ఏనాటికైనా నువ్వు నశించిపోతావు. మీరు ఎక్కడ బ్రతుకుతున్నారు. నిజంలో బ్రతుకుతున్నారా? అనిజంలో బ్రతుకుతున్నారా? అంటున్నారు ఆచార్యులవారు. మీ దేహాలు ఎక్కడ ఉన్నాయి అని అడగడం లేదు. మీరు కాశీలో ఉన్నారా? రామేశ్వరంలో ఉన్నారా? జిన్నూరులో ఉన్నారా? అని అడగడం లేదు. మీరు ఎక్కడ బ్రతుకుతున్నారు, మీ బ్రతుకు అంతా ఎక్కడ ఉంది అంటున్నారు. అంటే నువ్వు అసత్యం మీద బ్రతుకుతున్నావు అనుకో, ఏదైతే నిజం కాదో దానిని ఆధారంగా చేసుకుని నువ్వు బ్రతుకుతున్నావు అనుకో తప్పనిసరిగా నువ్వు బంధంలో పడతావు. నిజం కానిది నిన్ను బంధిస్తుంది, ఏదైతే నిజమో అది నిన్ను బంధించదు. ఇక్కడ లాజిక్ చూడండి. నిజం కానిదానిని నువ్వు నిజం అనుకున్నప్పటికీ అది నిజం కాదు కాబట్టి అది నిన్ను బంధిస్తుంది. అంటే మనం ఎండ్రిన్ తాగాము అనుకోండి, అది ఎండ్రిన్ అన్న సంగతి తెలియకుండా తాగాము అనుకోండి, తెలియకుండా తాగినా మనం చచ్చిపోతాం. అదేవిధంగా మీరు ఏదైతే కాదో అదే మీరు అనుకుని దానిని నిరంతరం ధ్యానం చేసి దానితో తాదాత్మ్యం పొందుతూ ఉంటే ఏనాటికైనా మీరు నశించిపోతారు. మీకు బాగుపడే ఉద్దేశ్యం ఉంటే మీరు ఏదైతే కాదో దానితో మీరు వేరుపడడం నేర్చుకోవాలి. అత్తగారి తోటి కోడలు, కోడలి తోటి అత్తగారు వేరుపడడం తేలికే కాని మనం కానిదానితోటి వేరుపడడం నేర్చుకోవాలి.



**గుర్తింపుల కోసం పని చేయవద్దు. మన ప్రవర్తన ఎలా ఉంటే ఈశ్వరానుగ్రహానికి పాత్రులవుతామో అలా మన జీవితాన్ని తీర్చిదిద్దుకోవాలి.**

మీకు అర్థం అవుతోందా? ఒకవేళ అలా సెపరేట్ అవ్వడం మనకి ఇష్టం లేకపోయినా దేవుడే సెపరేట్ చేసేస్తాడు. ఎవడి దేహాన్ని వాడు విడిచి పెట్టుకోవడం ఇష్టం ఉండదు, కానీ దేవుడు అందులోంచి తీసేస్తాడు. ఈనాటికి అయినా, ఏనాటికి అయినా, ముందు నాటికి అయినా మనం కానిదాని తోటి విడువడడం తప్పదు అన్నారు భగవాన్. మీరు గ్రహించవలసిన విషయం ఏమిటి అంటే, నువ్వు కానిదానితోటి ఎప్పటికైనా వేరుపడిపోతావు. నీకు ఇష్టం లేకపోయినా దేవుడు వేరు చేసేస్తాడు ఎందుచేత అంటే అది నువ్వు కాదు కాబట్టి. ఏదైతే నువ్వు కాదో దానినే స్మరించుకుంటూ ఉండడం అదంతా మాయ. మీరు ఏదైతే అవునో దానిని ధ్యానం చెయ్యండి, దానిని స్మరించుకోండి. నువ్వు కానిదానిని నువ్వు అనుకోవద్దు, నువ్వు కానిదానిని నువ్వు అనుకుని దానితోటి జీవించడం విడిచిపెట్టు, దానితోటి తాదాత్మ్యం విడిచిపెట్టు.

మనం ఎక్కడ బ్రతుకుతున్నామో మీకు అర్థం అవుతోందా? మన జీవితం దేనికి పరిమితం అయినది? దేహానికి పరిమితం, మనసుకి పరిమితం, మనం 24 గంటలు మన దేహం చుట్టూరు తిరుగుతాం, మన మనసు చుట్టూరు తిరుగుతాం. దేవుడిని ధ్యానం చేస్తున్నాము అని మీరు అనుకుంటున్నారు కానీ కోరికలనే ధ్యానం చేస్తున్నారు, విషయాలనే మీరు ధ్యానం చేస్తున్నారు. కోరిక నిజం కాదు, విషయాలు నిజం కాదు, భోగాలు నిజం కాదు, మీ మనసులో ఉన్న గొడవలు కూడా నిజం కాదు, మీ మనసులో ఉన్న దస్టంతా నిజం కాదు, కానీ వాటితోటే మీరు బ్రతుకుతున్నారు, అందులో బ్రతకటం మానేయండి అంటున్నారు.

కొంతమంది ఏమిచేస్తారు అంటే వాళ్ళకి ఇష్టంలేని వారిని తిడుతూ ఉంటారు, ఇష్టమైన వారిని పొగుడుతూ ఉంటారు. కొంతమందికి రాగద్వేషాలు బలీయంగా ఉంటాయి. అదంతా నిజం కాదు, ఆ నిజం కానిదానితోటి నువ్వు బ్రతుకుతున్నావు. నిజం కానిదానితోటి బ్రతుకుతూ, నిజం కానిదాని తోటి సంసారం చేస్తూఉంటే నీకు నిజం ఎలా తెలుస్తుంది అంటున్నారు. నువ్వు కానిదానిని కూడా నువ్వని అనుకోవచ్చు, అనుకోవద్దు అని ఎవడూ నీ పీకి పట్టుకోడు కానీ అది నువ్వు అవ్వవు. నువ్వు అందులో జీవించకు, నువ్వు కాని దాంట్లో నువ్వు జీవించకు. నువ్వు కానిదాని గురించి ఆలోచించకుండా ఏదైతే నువ్వు అవునో దాని గురించి ఆలోచించు. నువ్వు కాని దాంట్లో నివసించకుండా ఏదైతే నువ్వు అవునో అందులోనే నివసించడానికి ప్రయత్నం

చెయ్యి. నువ్వు ఏదైతే కాదో దానితో సహవాసం చేస్తావు అనుకో నీకు వెంటనే బంధం ఏర్పడుతుంది, బంధాన్ని బట్టి దేహం వస్తుంది. బంధం ఉన్న మనిషి పాపం చేస్తాడు, బంధం లేనివాడు పాపం చెయ్యడు. నువ్వు కానిదానితోటి బంధం పెట్టుకుంటే నువ్వు తప్పనిసరిగా పాపం చేస్తావు. నువ్వు కాని దేహం తోటి, నువ్వు కాని అహంభావన తోటి, నువ్వు కాని మమకారం తోటి, నువ్వు కాని ఇంద్రియాలు తోటి, నువ్వు అనుబంధం పెట్టుకుంటే నువ్వు పాపం చేస్తావు. అంటే బంధం ఏర్పడుతుంది. బంధం లోంచిమళ్ళీ దేహం వస్తుంది.

నిరంతరం సాధన చేసి ధ్యానం చేసి బ్రహ్మానుభవం కనుక పొందితే, జీవితంలో ఎప్పుడూ మీరు ఊహించనటువంటి మీ సంకల్పానికి అతీతం అయినటువంటి శాంతి, మీరు ఊహించనటువంటి సుఖం, అది మీకు వస్తుంది. ఏ సుఖాన్ని పొందిన తరువాత దానికి మించిన సుఖం లేదని తెలుస్తుందో అట్టిది ఆత్మసుఖం. అది నీ హృదయంలో ఉంది అని పరమాత్మ గీతలో చెప్పాడు. అంటే ఏ సుఖం పొందిన తరువాత దానికి మించిన సుఖం ఈ లోకంలో కానీ, పరలోకంలో కానీ లేదన్న సంగతి నీకు తెలుస్తుందో ఆ సుఖం బ్రహ్మంలో ఉంది. యోగం అంటే ఏమిటి అజ్ఞానం తోటి, దుఃఖం తోటి, బాధ తోటి మీకున్న సంబంధాన్ని తెంచేసుకోవడమే యోగం. అంటే మీరు భక్తిమార్గంలో ప్రయాణం చెయ్యండి, మీకున్న అజ్ఞానాన్ని, మీకున్న దుఃఖాన్ని భక్తి ద్వారా తొలగించుకోండి. అది ఇష్టం లేదా మీకు జ్ఞానమార్గం ద్వారా ప్రయాణం చెయ్యండి. మీకున్న అజ్ఞానాన్ని, మీకున్న దుఃఖాన్ని జ్ఞానం ద్వారా తొలగించుకోండి, మీరు ఏదైతే కాదో అందులోంచి మిమ్మల్ని విడుదల చెయ్యడమే యోగం యొక్క లక్ష్యం. అంటే మీరు కానిదానితోటి మీకున్న సంబంధాన్ని తెంపుతుంది, అది యోగం యొక్క ప్రయోజనం. ఎప్పుడైతే మీకు బ్రహ్మానుభవం కలిగిందో, మీ హృదయం యొక్క లోతుల్లోంచి దాని తాలుక సుఖం, శాంతి, ఆనందం మీకు తెలుస్తూ ఉంటుంది. మనం ఆనందాన్ని బుద్ధికే పరిమితం చేసేస్తున్నాం. ఆనందం బుద్ధికి పరిమితం అయినది కాదు, ఆనందం ఆత్మకి సంబంధించినది. ఏ కారణం వల్ల అయినా మీకు దుఃఖం వస్తోంది అనుకోండి, లోపల అజ్ఞానం ఉంటే, మోహం ఉంటే దుఃఖం వస్తుంది కానీ అజ్ఞానం లేనివాడికి, మోహం లేనివాడికి దుఃఖం అసలు రానే రాదు. దుఃఖం వచ్చింది అంటే అక్కడ అజ్ఞానం ఉన్నట్టే, మోహం ఉన్నట్టే. కడుపు నొప్పి ఉందంటే అక్కడ కడుపులో ఏదో చెడ్డ ఉన్నట్టే.

తలకాయ పోటు వచ్చింది అంటే తలకాయలో ఏదో చెడ్డ ఉన్నట్టే. కళ్లు మండుతున్నాయి అంటే ఆ కళ్లలో ఏదో చెడ్డ ఉన్నట్టు. అదేవిధంగా నీకు ఏ కారణం వల్ల దుఃఖం వచ్చినప్పటికీ అక్కడ అజ్ఞానం ఉందని, మోహం ఉందని మీరు గుర్తు పెట్టుకోండి, కొండ గుర్తు కోసం చెబుతున్నాను. ఇప్పుడు మనం ఇలా కూర్చున్నాం, మనకేదో దుఃఖం వస్తుంది. ఈ దుఃఖం ఎందుకు వస్తోంది అంటే వెనకాల అజ్ఞానం ఉంది, మోహం ఉంది. మోహం లేనివాడికి దుఃఖం లేదు, అజ్ఞానం లేనివాడికి దుఃఖం లేదు. దుఃఖం వచ్చింది అంటే అజ్ఞానం ఉండి తీరాలి, దుఃఖం వచ్చింది అంటే మోహం ఉండి తీరాలి.

మీకు బ్రహ్మానుభవం కలిగిన వెంటనే అజ్ఞానం నశిస్తుంది. అజ్ఞానం ఉంటే దుఃఖం ఉంటుంది. అజ్ఞానం నశించిన వెంటనే దుఃఖం కూడా నశిస్తుంది. నువ్వు బ్రహ్మానుభవం అనేది నీ హృదయంలో పొందవచ్చు. దానికోసం నీ శరీరం చనిపోవక్కర్లేదు, నీ దేహం ఇక్కడ ఉండగానే, నీ దేహం తిరుగాడుతున్నప్పుడే ఆ బ్రహ్మానుభవంను నీ హృదయంలో డైరెక్ట్‌గా పొందవచ్చు. ప్రత్యక్షంగా ఆ వస్తువును నువ్వు అనుభవంలోకి తెచ్చుకోవచ్చు. ఇక్కడే తెచ్చుకోవచ్చు, ఇప్పుడే తెచ్చుకోవచ్చు. ఆ వస్తువు నీకు సిద్ధంగానే ఉంది, ఆవస్తువు నీ హృదయంలో ఉంది. అది అనుభవంలోకి వచ్చిన వెంటనే అజ్ఞానం తోటి నీకు ఉన్న సంబంధం తెగిపోతుంది. అప్పుడు దాని తాలుక సుఖం నీకు తెలుస్తుంది, శాంతి నీకు తెలుస్తుంది. కొంతమంది నిరంతరం విషయచింతన చేస్తూ ఉంటారు, వాళ్ళకి ఆత్మచింతన ఉండదు, దైవచింతన ఉండదు, గురువుచింతన ఉండదు. నిరంతరం విషయచింతన చేసేవాడికి ఏ విషయాన్ని అయితే వాడు చింతిస్తున్నాడో దానిమీద కోరిక కలుగుతుంది. అంటే మీరు ఏదైతే చింతిస్తున్నారో అదే మీరు అవుతారు. ఇది జ్ఞాపకం పెట్టుకోండి. ఏదైతే మీరు చింతిస్తున్నారో అదే మీరు అవుతారు. మీరు విషయాన్నే చింతిస్తున్నారు అనుకోండి విషయం అవుతారు. ఆత్మని చింతిస్తున్నారు అనుకోండి ఆత్మ అవుతారు. మీరు విషయాన్ని చింతించగా, చింతించగా విషయం మీద మీకు కోరిక కలుగుతుంది. కోరిక కలిగిన తరువాత ఆ కోరిక నెరవేర్చుకోవడానికి మీరు ప్రయత్నం చేస్తారు. మీ దేహప్రారబ్దంలో ఆ కోరిక నెరవేరే యోగం ఉంటే అవుతుంది, లేకపోతే అవ్వదు. కోరిక నెరవేరితే ఒక తంటా, నెరవేరకపోతే ఒక తంటా, మీకు అర్థం అవుతోందా? నెరవేరితే గర్వం వస్తుంది, నెరవేరకపోతే దుఃఖం

వస్తుంది. మీకు ఏదైనా కోరిక వచ్చింది అనుకోండి, నెరవేరిపోయింది అనుకోండి, మీకు గర్వం వచ్చేస్తుంది. మనకి గర్వం ఏమీ లేదు అనుకుంటాం కాని చాలా గర్వం ఉంటుంది. మనకి ఎంత అవినయం ఉందో, ఎంత గర్వం ఉందో, ఎంత పొగరుబోతుతనం ఉందో, అంతరదృష్టి ఉన్నవాడికి మటుకే తెలుస్తుంది. అంతరదృష్టి లేనివాడికి ఏది పోగొట్టుకోవాలో అసలు వాడికే తెలియదు. కొంతమందికి రోగం ఉంటుంది, ఆ రోగాన్ని పోగొట్టుకోవడానికి ప్రయత్నం చేస్తారు. కొంతమందికి రోగం ఉందని కూడా వాళ్ళకి తెలియదు. పెద్దలు ఏమని చెబుతారు అంటే మూర్ఖుడికి పుస్తకం అక్కర్లేదు, మోక్షం పొందిన వాడికి పుస్తకం అక్కర్లేదు, సాధన చేసుకునేవాడికి పుస్తకం కావాలి. అసలు మూర్ఖుడుకి ఎందుకు పుస్తకం అక్కర్లేదు అంటే అసలు వాడికి తెలుసుకోవాలి అనే కాంక్ష కూడా ఉండదు. మోక్షం పొందిన వాడికి తెలుసుకోవాల్సింది అంటూ ఏది లేదు. ఇంక సాధకుడికి, ముముక్షువుకి అంటే మోక్షం పొందాలి అనే కోరిక ఉన్నవాడికి శాస్త్రం కావాలి అని చెపుతారు.

అద్దంలో నువ్వు ముఖం చూసుకుంటున్నావు, అందులో ఏమి కనిపిస్తుంది? నీ ప్రతిబింబం కనిపిస్తుంది. అద్దంలో కనిపించే ప్రతిబింబం ఎంత నిజమో, ప్రపంచంలోని వస్తుజాలం అంతా కూడా అంతే నిజం అన్నారు. బింబం ఆత్మ, ప్రతిబింబం అంతా మాయ. ప్రతిబింబం అంటే ఉన్నదానివలె కనిపిస్తుంది. మీరు చెయ్యి పెట్టి ప్రతిబింబాన్ని ముట్టుకుందాం అని చూస్తారు అనుకోండి మీ చేతికి తగలదు. ఆత్మ ఒక్కటే నిజం, నీ మనసుకి కనిపించే వస్తుజాలం అంతా కూడా ప్రతిబింబం లాంటిదే. ప్రతిబింబం ఎంత నిజమో, ఆ ప్రతిబింబాన్ని ముట్టుకోవడానికి ప్రయత్నం చెయ్యడం ఎలా ఉంటుందో, ప్రపంచంలో ఉన్న వస్తువుల ద్వారా మోక్షాన్ని పొందుదాం, సుఖాన్ని పొందుదాం, శాంతిని పొందుదాం అనుకోవడం కూడా అటువంటిదే. ముందు మీరు బాగా విషయం గ్రహించాలి. కృష్ణుడు ఆత్మని తెలుసుకో, ఆత్మని తెలుసుకో అని గీతలో చెబుతాడు. ఆత్మ అంటే ఎవరో కాదు మనమే. అంటే మనల్ని మనమే తెలుసుకోవాలి అంటున్నాడు. దీనికి భగవాన్ ఏమని చెప్పారు అంటే నిన్ను నువ్వు తెలుసుకోవడానికి పెద్ద తెలివితేటలు అక్కర్లేదు, నువ్వు నేను, నేను అంటున్నావు కదా! ఆ నేనుని నేనుతోటి తీసేసుకుంటే నువ్వు ఎవరవో నీకు తెలుస్తుంది అన్నారు. ముల్లుని ముల్లు తోటి తీసేసినట్టే ఏదైతే నేను, నేను అంటున్నావో, ఆ నేను ఉందన్న సంగతి నీకు తెలుస్తోంది

కదా, ఆ నేనుని నేనుతోటి తీసేస్తే అదే సాధన.  ఆ నేనుని నేనుతోటి తీసేస్తే ఉన్నదేదో నీకు తెలుస్తుంది అన్నారు.  దేవుడు ఉన్నాడో, లేదో నీకు తెలియదు.  కాని నేను ఒకటి తెలుస్తోంది కదా, ఆ నేనుని నేను సహాయం తోటి తీసేయ్.

నీతో నువ్వు విరోధంగా ఉండకు, నీతో నువ్వు స్నేహంగా ఉండు అని పరమాత్మ చెప్పాడు.  నీ మనసు తోటి విరోధం పెట్టుకోకు, నీ మనసు తోటి స్నేహంగానే ఉండు అన్నాడు.  ఏదైతే నువ్వు నేను నేను అంటున్నావో ఆ నేనుని ఉపయోగించుకుని నేనుని తీసేయ్.  నీకు స్వాధీనమైన మనసు నీకు ఉపకారం చేస్తుంది.  నీకు స్వాధీనంలో లేని మనసు నీకు అపకారం చేస్తుంది, అందుచేత నీ మనసుని నువ్వు మంచి చేసుకో.  నీ మనసుని నువ్వు మంచి చేసుకుంటే ఇతరులు ఎవరూ చెయ్యలేని ఉపకారం నీ మనసే నీకు చేసి పెడుతుంది, ఇతరులు ఎవరూ నీకు ఇవ్వలేని సుఖాన్ని నీ మనసే నీకు ఇస్తుంది.  అది ఇక్కడ రహస్యం. అంటే అణిగిన మనస్సు, పల్చబడిన మనస్సు నీకు శాంతిని కలుగజేస్తుంది, సుఖాన్ని కలుగజేస్తుంది.  మానవుడు అనుభవించే భోగాలు అన్నీ ఎటువంటివి అంటే ఇసుకలో పోసిన నూనె లాంటివి అన్నారు.  విషయచింతన వల్ల కోరిక వస్తుంది, కోరిక వల్ల కోపం వస్తుంది. ఆ కోపంలోంచి మోహం పుడుతుంది.  మోహం వల్ల విచక్షణ తగ్గిపోతుంది.  అంటే ఆత్మానాత్మ వివేకం, అంటే ఇది నిజం, ఇది నిజం కాదు, ఇది ఆత్మ, ఇది అనాత్మ, ఇది సత్యం, ఇది అసత్యం, ఇది నిత్యం, ఇది అనిత్యం అని గ్రహించే బుద్ధి నీకు పోతుంది.  ఎప్పుడైతే మనిషి మోహంలో పడ్డాడో వాడికి బుద్ధి నశించటం ప్రారంభిస్తుంది.  బుద్ధి నశించటం ప్రారంభం అయిన తరువాత పూర్తిగా మనిషి నశించిపోతాడు.

ఇది బాగా అర్థం చేసుకోండి.  విషయాన్ని చింతించడం వలన కోరిక కలుగుతుంది,



**దుఖం తలంపు రూపంలో వస్తుంది. ఆ తలంపుని చూసేవాడు ఒకడు ఉంటాడు, ఆ చూసేవాడు ఎంత నిజమో చూడబడేది కూడా అంతే నిజం. వాడిని తీసేస్తే ఆ తలంపు కూడా పోతుంది.**

కోరిక లోంచి కోపం వస్తుంది, కోపం లోంచి మోహం వస్తుంది. మోహం వచ్చిన వెంటనే విచక్షణ నశిస్తుంది. విచక్షణ అంటే ఏమిటి? ఏది నిత్యం, ఏది నిత్యం కాదు? ఏది సత్యం, ఏది సత్యం కాదు? అనే వివేకం, ఆ discrimination నశిస్తుంది. అంటే ఎక్కడ ఎలా మాట్లాడాలో, ఏమి మాట్లాడాలో తెలియదు, ఆ విచక్షణ ఎప్పుడైతే నశించిందో వాడికి బుద్ధి నశిస్తుంది. బుద్ధి నశించిన తరువాత నెమ్మదిగా, నెమ్మదిగా కాన్సర్ జబ్బు వచ్చినవాడు ఎలా పీడించబడి, పీడించబడి చచ్చిపోతాడో, అలాగే బుద్ధి నశించటం ప్రారంభం అయిన తరువాత స్లోగా, పూర్తిగా మనిషి నశించిపోతాడు.

మన శరీరానికి డ్రైవర్ ఎవరు? బుద్ధి. డ్రైవర్ ని మనం బాగా చూసుకోవాలి. డ్రైవర్ సరిగ్గా లేదు అనుకోండి శరీరం నశించిపోయినట్టే. బుద్ధి ఎప్పుడైతే పాడైపోయిందో వాడు చీకటి లోకాలకి పోతాడు. అందుచేత బుద్ధిని కాపాడుకోవాలి. ఆచార్యులవారు అంటారు నీ బుద్ధిని నువ్వు పోషించుకోఅంటారు, నీకు సొంతబుద్ధి కావాలి అంటారు. నువ్వు సొంతబుద్ధిని కాపాడుకో, ఏదైనా ఒక వాక్యం చదివినప్పుడు ఇందులో ఎంత నిజం ఉంది, ఎంత నిజం లేదు, ఒక సబ్జెక్టు విన్నప్పుడుఇందులో ఎంత నిజం ఉంది, ఎంత నిజం లేదు అని నీ బుద్ధిని ఉపయోగించుకో, నీ సొంతబుద్ధిని జీవితం పొడవునా కాపాడుకో. చాలామందికి సొంతబుద్ధి ఉండదు. వాళ్ళు ఉంది అని అనుకుంటారు కానీ చాలామందికి స్వతంత్ర్య ఆలోచన ఉండదు. అందుచేత ఆచార్యులవారు ఏమన్నారు అంటే నీ సొంతబుద్ధిని కాపాడుకో, అంటే ఎప్పుడైతే మనం సొంతబుద్ధిని కాపాడుకోలేదో మనం బానిసలు తోటి సమానం. వాడికి ఎంత ఐశ్వర్యం ఉన్నా, ఎంత చదువు ఉన్నా, సొంతబుద్ధి లేనివాడు బానిస తోటి సమానం. ఆచార్యులవారు ఏమంటున్నారు అంటే నీ మనసు బాహ్య విషయాల మీదకి కానీ, బాహ్య వస్తువుల మీదకి కానీ, బాహ్య చింతల మీదకి కానీ వెళుతుంటే, నీ వివేకం ఉపయోగించి, నీ తెలివిని ఉపయోగించి, నీ బుద్ధిని ఉపయోగించి, మనసుని విషయచింతలలోంచి వెనక్కి లాగి అది ఆత్మని చింతించేలా చెయ్యి. అలా చేస్తే అప్పుడు నువ్వు బాగుపడతావు. బాహ్యానికి విజృంభిస్తున్న మనసుని, నెమ్మదిగా ఆ విషయాలలోంచి వెనక్కి మళ్లించి, ఆత్మని చింతించేలా చెయ్యి. అది ఎలా చేస్తావు అంటే నీ బుద్ధిని ఉపయోగించు, నీ వివేకాన్ని ఉపయోగించు, మీకు అర్థం అవుతోందా? మీకు వివేకం ఉంది కదా, ఆ వివేకాన్ని ఉపయోగించుకుని నువ్వు బాగుపడే

విధానం చూసుకో, నీ హృదయంలో బ్రహ్మం ఉంది కానీ భావనాబలం లేకుండా ఆ బ్రహ్మంను పొందలేవు. ఇది మంత్రం లాంటిది, బాగా జ్ఞాపకం పెట్టుకోండి. బ్రహ్మం ఎక్కడో మీకు దూరాన లేదు, మీ హృదయంలోనే ఉంది, మీకు అత్యంత సమీపంలో ఉంది. కానీ భావనాబలం నీకు లేకుండా ఆ బ్రహ్మంను నువ్వు పొందలేవు. భావనాబలాన్ని నువ్వు ఎలా సంపాదిస్తావు? జపం ద్వారానో, జ్ఞానం ద్వారానో, విచారణ ద్వారానో ఆ భావనాబలాన్ని పొందు. లేకపోతే ప్రాణాయామం ద్వారా పొందు. భావనాబలం లేకుండా నువ్వు బ్రహ్మంను పొందలేవు. నీ లోపల బ్రహ్మానుభవం కలగకుండా నీకు శాంతి కలగదు. బ్రహ్మజ్ఞానం లేకుండా, ఆత్మజ్ఞానం లేకుండా ఏ మనిషికి మోక్షం రాదు. మోక్షం కావాలి అంటే నువ్వు ఆత్మజ్ఞానం సంపాదించు.

ముముక్షుత్వం ఉండాలి అంటే మోక్షం సంపాదించాలి అనే కాంక్ష ఉండాలి. మోక్షం సంపాదించాలి అనే కాంక్ష నీకు ఎప్పుడు వస్తుంది? మోక్షం యొక్క విలువ తెలిసినప్పుడు వస్తుంది. ఏ వస్తువుని అయితే మనం పొందుదాం అనుకుంటున్నామో, ఆ వస్తువుకి సంబంధించిన importance కూడా మనకు తెలియాలి. ఆ వస్తువు యొక్క importance మనకు తెలియదు అనుకో, అది పొందాలనే బుద్ధి కూడా మనకి కలుగదు. మనకి ఏదైనా బాధ వస్తే దేవుడు మనలని వదిలేశాడు అనుకుంటాం. అది రాంగ్ థింకింగ్, అది ఫాల్స్ థింకింగ్ అంటున్నారు భగవాన్. దేవుడు నిన్ను అనుగ్రహించడం కోసమే ఆ బాధ, దుఃఖం నీకు పంపాడు. కానీ ఆ విషయం నీకు తెలియక దేవుడి అనుగ్రహం నా మీద లేదు అనుకుంటున్నావు. దేవుడి అనుగ్రహం ఎపుడూ ఉంది, అది లేని క్షణం అంటూ లేదు. నిరంతరం ప్రవహిస్తూనే ఉంది, ఆ ప్రవాహాన్ని చూడలేక లేదు అనుకుంటున్నాం. అది ఉంది అన్న సంగతి తెలియక లేదు అనుకుంటున్నాం. ఒక్కొక్కసారి మీకు బాగా ఇష్టమైన వాళ్ళే మిమ్మల్ని తిడుతూ ఉంటారు, మీకు అర్థం అవుతోందా? నిజంగా వాళ్ళు తిడుతున్నారా మిమ్మల్ని? అంటే కాదు దేవుడే తిట్టిస్తున్నాడు. ఎందుచేత అంటే వాళ్ళ మీద మీకు ఉన్న మమకారం పోవడం కోసం, లేకపోతే చచ్చేవరకు వాళ్ళ వెనకాల తిరుగుతూ ఉంటారు. ఒక్కొక్కసారి మనకి బాగా ఇష్టమైన వాళ్ళే మనలని తిడతారు. అలా తిట్టకపోతే చచ్చేవరకు దేవుడిని తలపెట్టుకోకుండా వాళ్ళనే తలపెట్టుకుంటాం. అందుచేత దేవుడు ఏమిచేస్తాడు అంటే వీళ్ళు నన్ను తలపెట్టటం లేదు,

మాయలో పడిపోతున్నారు అని మనలని తిట్టిస్తూ ఉంటాడు. అలా తిట్టించినప్పుడు కానీ మీకు మమకారం వదలదు. మీ మమకారం వదిలించడం కోసం వాడి చేత తిట్టిస్తాడు. ఆ మమకారం కాస్తా వదిలిన తరువాత అప్పుడు బుద్ధి దేవుడి మీద స్థిరంగా ఉంటుంది. ఎవడి మీద అయితే మీకు మమకారం ఉందో వాళ్ళు మిమ్మల్ని తిట్టినా, అది కూడా దేవుడి అనుగ్రహమే, దేవుడి అనుగ్రహం ఎప్పుడూ ఉంటుంది, కానీ లేదు అని మనం అనుకుంటాం. ఎందుచేత అంటే ఆ గుర్తించే వివేకం, ఆ గుర్తించే తెలివి మనకి లేకపోవటం వలన అలా అనుకొంటున్నాము.

గౌతమ బుద్ధుడు ఏమన్నాడు అంటే జరిగిపోయిన గొడవలు అస్తమాను తలపెట్టుకుని కాలాన్ని వేస్ట్ చేసుకోవద్దు. భవిషత్తులో మీరు మోక్షం పొందడం కోసం మంచి రోడ్డు నిర్మించుకోవడానికి చూసుకోండి అని చెప్పాడు. ఆచార్యులవారు చెప్పారు కదా ఇల్లు అంటుకుంది అనుకోండి మీరు వెంటనే బయటకి వచ్చేస్తారా లేకపోతే మేము చాలా పెద్దవాళ్ళం, గొప్పవాళ్ళం, బయట వాళ్ళు ఎవరైనా వచ్చి మమ్మల్ని ఆహ్వానిస్తేనే బయటకి వస్తాము అనుకొంటారా? మీరు ఎవరి ఆహ్వానం కోసం చూడరు. అంటుకుపోయిన ఇంట్లోంచి వెంటనే బయటకి వచ్చేస్తారు. కారణం ఏమిటి చెప్పండి? వాడి ప్రాణాన్ని వాడు రక్షించుకోవడం కోసం ఎవరి కోసం చూడడం లేదు, వాడంతటవాడే వెంటనే బయటకి వచ్చేస్తున్నాడు. అలాగే మీరు మోక్షం కోసం ప్రయత్నం చేస్తే ఈ జన్మలోనే మోక్షం పొందుతారు అన్నారు. వాడి ప్రాణాన్ని రక్షించుకోవడం కోసం వాడు formalities చూడడం లేదు. చిన్న కారు వచ్చిందా? లేదా? చిన్నకారు వస్తేనే నేను ఇంట్లోంచి బయటకి వెళతాను అనటం లేదు. వాడి ప్రాణం ముఖ్యం అందుచేత వెంటనే బయటకి వచ్చేస్తున్నాడు. వాడి ప్రాణాన్ని రక్షించుకోవడం కోసం వెంటనే ఇంట్లోంచి బయటకి ఎలా వచ్చేస్తున్నాడో, అదేవిధంగా ఈ ప్రపంచం అనే అగ్ని గుండం నుంచి బయటకి రావాలి అంటే వాడు ఇంట్లోంచి ఎంత వేగంగా బయటకి వస్తాడో అంత వేగంగా మీరు సాధన చేసుకుంటే ఈ జన్మలోనే తరిస్తారు. కాదు అంటారా ఇంక మీరు కామక్రోధాలలోంచి విడుదల పొందలేరు. అప్పుడు మీరు వెంటనే కర్మ చేస్తారు, కర్మ బట్టి దేహం వస్తుంది, దేహం బట్టి దుఃఖం వస్తుంది, దుఃఖం బట్టి సంసారం వస్తుంది. దుఃఖం ఎవరికి వస్తుంది? మనసుకి వస్తుంది. దేహం ఎవరికి వస్తుంది? మనసుకి వస్తుంది.

భగవాన్ చెప్పిన రహస్యం ఇక్కడ ఉంది. ఆ దుఃఖం ఎంత నిజం అంటే నీ మనసు ఎంత నిజమో, ఆ దుఃఖం కూడా అంతే నిజం. ఎవరైనా తిట్టారు అనుకోండి మీకు బాధ వస్తుంది. ఎవరైనా పొగిడితే మీకు సంతోషం వస్తుంది. మీకు అర్థం అవుతోందా? ఆ పొగడడం వలన వచ్చే సంతోషం, విమర్శించడం వలన వచ్చే దుఃఖం, అవన్నీ నిజం కాదు. మనస్సు ఎంత నిజమో అవి కూడా అంతే నిజం. మీ వివేకాన్ని ఉపయోగించి వీటిలోంచి బయటపడాలి.

పూర్వం అన్నీ మట్టి రోడ్డులే, మీకు అర్థం అవుతోందా? పూర్వం అన్నీ రెండు ఎద్దుల బండ్లే, పూర్వం కార్లు లేవు, రైళ్ళు లేవు, విమానాలు లేవు. ఇప్పుడు కార్లు వచ్చేశాయి, రైళ్ళు వచ్చేశాయి, విమానాలు వచ్చేశాయి. అంతమాత్రం చేత మీరు అందరూ సుఖంగా ఉన్నారా? శాంతిగా ఉన్నారా? ఆనందంగా ఉన్నారా?అని అడుగుతున్నారు. అంటే కారులో సుఖం ఉంటే, రైలులో సుఖం ఉంటే, విమానంలో సుఖం ఉంటే మీరు అందరూ సుఖపడిపోవాలి కదా, మీలోఎవడి ముఖంలో అయినా సుఖం ఉందా?ఎవడి హృదయంలో అయినా శాంతి ఉందా? దీనికి సమాధానం చెప్పమంటున్నారు ఆచార్యులవారు. సుఖం అనేది బయట లేదు, బ్రహ్మంలో మాత్రమే సుఖం ఉంది. సుఖమునకు మరొక పేరే బ్రహ్మం, అది తెలుసుకున్నప్పుడే మీకు సుఖం ఎలా ఉంటుందో తెలుస్తుంది కానీ ఊరికే రైలులో గంటసేపు కూర్చుంటే మీకు సుఖం వచ్చేయదు. సుఖం ఎక్కడ ఉంది? బ్రహ్మంలోనే ఉంది. ఆ బ్రహ్మం ఎవరు? నీవే అయ్యి ఉన్నావు. అంటే నీ లోపలే సుఖం ఉంది. నువ్వు ఎవరవో ఆ వస్తువు నీకు తెలిస్తే నీకు సుఖం కూడా తెలుస్తుంది. ఎందుచేత అంటే లోపల ఉన్న వస్తువుకి వేరుగా, నీ స్వరూపానికి వేరుగా సుఖం లేదు.

ఆచార్యులవారు చెప్పేది ఏమిటి అంటే, భగవంతుడి నామం చాలా పవిత్రమైనది. రామనామం కాని, కృష్ణనామం కాని, శివనామం కాని, రమణనామం కాని ఏనామం అయినా భగవంతుడి నామం చాలా పవిత్రమైనది. భగవంతుడి నామం ఎంత పవిత్రమైనదో, ఆ నామాన్ని మీరు స్మరించుకొంటూ ఉంటే మీ హృదయాలు కూడా అంత పవిత్రం అయిపోతాయి. ఎప్పుడైతే మీ హృదయాలు అన్నీ పవిత్రం అయిపోయాయో, అప్పుడు మీ హృదయంలో ఉన్న బ్రహ్మం మీకు ఎరుక పడుతుంది, అప్పుడు అక్కడ ఉన్న శాంతి, ఆనందం మీకు అందుతాయి, మీరు సుఖపడతారు.

ది॥ 23-09-2026 బుధవారము నాడు

## సద్గురు **శ్రీ నాన్నగారి జయంతి** సందర్భముగా

## సద్గురు శ్రీ నాన్నగారి దివ్య సన్నిధి



# సత్సంకల్పం

భాష మొత్తం అ......హ మధ్యలోనే ఇమిడి ఉన్నట్లు, సకలమూ పరమాత్మ ఆధీనములోనే, ఆయనలోనే ఇమిడి ఉన్నాయి. విత్తనముబట్టి మొక్క అన్నట్లు, ఎట్టి సంకల్పమో అట్టి ఫలితము వస్తుంది. మానవుడు ఏమి సంకల్పించినా పరమాత్మ తథాస్తు తథాస్తు అని ఆశీర్వదిస్తూ ఉంటాడు. ఈ సత్యాన్ని మనమందరమూ గుర్తించాలి. పరమాత్మ నుండి మనము దేనినీ దాచలేము. మన తలంపు మనకంటే ముందే పరమాత్మకు తెలుస్తుంది, ఎందుకంటే ఆయన హృదయవాసి కనుక అనగా మూలతలంపు మూలములో ఉన్నది పరమాత్మే కనుక. కాబట్టి మనము మంచి సంకల్పాలను వృద్ధి చేసుకోవాలి, అప్పుడే మనము మంచి ఫలితాలను పొందగలము. చెడు మరియు స్వార్థపూరిత తలంపుల వల్ల చెడు ఫలితాలనే ప్రాప్తిస్తాయి. మనిషి తన తలంపు మంచిగా ఉన్నదా? లేదా చెడుగా ఉన్నదా? అని విచారణ చేయడు కానీ ఏదైనా చెడ్డ ఫలితాన్ని అనుభవించవలసి వచ్చినప్పుడు మాత్రం పరమాత్మ నాకు ఎందుకు ఇటువంటి ఫలితాన్ని ఇచ్చాడు అని బాధపడతాడు. అది తన సంకల్ప దోషమే గాని, భగవంతుని దోషము కాదు. పుటముచే మట్టితో కూడిన బంగారము మేలిమి బంగారముగా మారునట్లు, జీవుడు ఆత్మ పరిశోధన చేత సాక్షాత్తు తానే బ్రహ్మమై వెలుగుతాడు. నరుడు నారాయణుడై శోభిస్తాడు. చిత్తరూప శృంఖలములను విచ్ఛిన్నమొనర్చి, తాను అమృత స్వరూపుడే కాగలడు. ఇప్పుడు మానవ జన్మ అనే గొప్ప సదవకాశము లభించినది కాబట్టి, అట్లే సద్గురువు లభించారు కాబట్టి, భవరోగమును బాపుకుని స్వరూప సచ్చిదానంద స్థితిని అనుభవైకవేద్యం చేసుకోవాలి. ప్రాపంచిక దృష్టిని వదిలి, ఆత్మదృష్టిని అలవరచుకోవాలి. మనకు కష్టాలు వచ్చినా, ఇష్టం లేని సంఘటనలు జరిగినా, ఇదంతా మన మనస్సుకు శిక్షణనివ్వడాని, అట్లే శరీరము మరణించిన తరువాత ఏదైతే మన కూడా వస్తుందో దానిని పవిత్రం చేయడావనికి, సద్గురువు చేసే పనే కాని మరేమీ కాదు. మనము చేసే ప్రతి పనిని అహంకార రహితంగా, ఈశ్వరార్పణ బుద్ధితో చేయాలి. స్వార్థం, కపటం లేకుండా కర్మాచరణ చేయాలి. ఆధ్యాత్మికం వేరు, మనము చేసే పనులు వేరు అని వాటిని విడిగా చూడకూడదు. మనము చేసే పనులే భగవంతునికి పూజగా మారాలి. కపటం, దూషణం వంటి దోషాలు లేని మాటయే మధురవచనం. ధార్మిక జీవనమే ఆధ్యాత్మికత, ధర్మాన్ని తప్పకూడదు. ప్రతి మనిషి తనకు పరమాత్మ ప్రసాదించిన ఈ మానవ జన్మ పరమ లక్ష్యాన్ని తెలుసుకుని, ఎటువంటి ఆకర్షణలకు, ప్రలోభాలకు లోనుకాకుండా, ఎల్లప్పుడు భక్తి, శ్రద్ధలతో అహంకార, మమకార రహితంగా సద్గురువుకు శరణాగతి చెంది, పరమాత్మతో ఏకత్వాన్ని సిద్ధింపజేసుకోవాలి.

**- చావలి సూర్యనారాయణమూర్తి, అమలాపురం, సెల్ : 9963195064**